
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 20.0

ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.30 (309.9534)	51,139	51,139
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,132.84	3,983.93
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.818 (43.9377)	38,080	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240



కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ముప్పుతిప్పలు పెడుతోందని రైతులు గగ్గోలుపెడుతున్నారు. సీసీఐ రోజుకో ఆంక్ష విధిస్తుండటంతో పత్తి కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో విధిలేక పత్తిని దళారులకు విక్రయిస్తున్నామని వాపోతున్నారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించి 15రోజులు కాగా, ఇప్పటి వరకు కేవలం 1,476 మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

15 రోజుల్లో.. 1476 మెట్రిక్ టన్నులే!

- మందకొడిగా పత్తి కొనుగోలు ప్రక్రియ
- కొనుగోళ్లకు ముప్పుతిప్పలు పెడుతున్న సీసీఐ
- రోజుకో ఆంక్షతో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు

రైతులను ఆదుకునేందుకు సీసీఐ పెద్ద మొత్తంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాల్సి ఉండగా, అటు జిన్నింగ్ మిల్లులకు, ఇటు రైతులకు ఎలాంటి ప్రయోజనం లేనివిధంగా వ్యవహరిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక దశలో జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మెకు వెళ్లాలని ప్రయత్నించగా, రాష్ట్ర ప్రభుత్వం జోక్యంతో విరమించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీఐ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావివ్వడమేగాక దళారులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2025-26లో మద్దతు ధరకు సీసీఐకి పత్తి విక్రయించేందుకు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని నిబంధన విధించింది. ఈ యాప్ డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్‌పై రైతులకు అవగాహన లేకపోవడంతో పాటు కొందరు రైతులకు అసలు స్మార్ట్‌ఫోన్ కూడా లేదు. మొబైల్ నెంబర్‌తో ఓటీపీ ద్వారా లాగిన్ కావాలని, సీసీ ద్వారా మద్దతు ధర పొందాలంటే రైతులు కచ్చితంగా 'కపాస్ కిసాన్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించడం తలనొప్పిగా మారింది. ఈ నిబంధనను ఎందుకు విధించారనే దానిపై స్పష్టత లేదు. దీనికి తోడు ఐరిష్ స్కాన్ లేదంటే ఓటీపీ ద్వారా ఆధార్ ధ్రువీకరణ ఉండాలనడం, ఆధార్ మొబైల్ లింకు ఉన్నదే తీసుకురావాలని చెప్పడం సమస్యగా మారింది. సీసీఐ వద్ద మద్దతు ధరకు పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్ విధానంకూడా సమస్యగా పరిణమించింది.

1,476 మెట్రిక్ టన్నులు కొనుగోలు

జిల్లాలో సీసీఐ కొనుగోళ్లు నామమాత్రంగా సాగుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 57 లక్షలకు పైగా క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తుందని అంచనా. అయితే అకాల వర్షాలు, తుఫాన్, తెగుళ్ల కారణంగా పత్తి దిగుబడి 50 శాతానికి పడిపోయింది. వచ్చిన పత్తి కూడా రంగు మారడం, తడిసిపోవడంతో రైతులను కుంగదీస్తోంది. ఇప్పటి వరకు అంటే 15రోజుల్లో సీసీఐ కేవలం 1,476 మెట్రిక్‌టన్నులు (14,760 క్వింటాళ్లు) మాత్రమే కొనుగోలు చేసింది. 8శాతం తేమ ఉన్న పత్తికి మాత్రమే క్వింటాకు రూ.8,110 చెల్లిస్తుండగా, ఆపైనా తేమశాతం పెరిగితే రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకొస్తున్నా పలు తిరకాసులు పెడుతోంది. స్లాట్ బుకింగ్‌కే సమయం సరిపోతోందని రైతులు వాపోతున్నారు. సీసీఐ మద్దతు ధర ఇచ్చేలా లేదని రైతులు భావిస్తూ దళారుల వైపు వెళ్లుతున్నారు. దీంతో దళారులు పత్తి నాణ్యత లేదని పేర్కొంటూ క్వింటాకు రూ.5వేల లోపే ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే దళారులు చాలా చోట్ల రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి వారికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ జీరాక్స్‌లు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రైతుల పేరుతో దళారులు సీసీఐలో పత్తి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. రైతుల నుంచి పత్తి..

- మిగతా 8వ పేజీలో...



చలి పెరుగుతోంది

తగ్గుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

నల్లగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఈ నెల మొదటి వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతోంది. అడపాదడపా వర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చల్లటి గాలులు వీస్తున్నాయి. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ గాలులు ఉంటున్నాయి. చలి గాలులతో పిల్లలు, వృద్ధులు అధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి నెల రెండో వారం వరకు చలి ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంటోంది. ఇప్పటికే వాతావరణశాఖ చలి గాలులకు సంబంధించి ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. అంతేగాక ఈ నెల మూడో వారం నుంచి డిసెంబరు, జనవరి నెలల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంటోంది. ఆదివారం కనిష్ఠ ఉష్ణోగ్రత 20డిగ్రీలుగా నమోదైంది. చలి పెరుగుతుండటంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా స్వెట్టర్లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే చలినుంచి రక్షణకోసం చలి మంటలు వేస్తున్నారు.

చలి గాలుల నుంచి రక్షణ ఇలా

- చల్లని గాలులు ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్లడం తగ్గించాలి.
- వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.
- చలికాలంలో డీ-విటమిన్ కోసం ఉదయం ఎండలో కాసేపు ఉండటంతో పాటు పోషకాహారం తీసుకోవాలి.
- పొరలుగా ఉన్న దుస్తులు ధరిస్తే వెచ్చదనం పెరుగుతుంది.

- మిగతా 7వ పేజీలో...

న్యాయ సహాయం, చట్టాలపై అవగాహన

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు

నల్లగొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు తెలిపారు. ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ నిర్వహించడంతోపాటు కుటుంబ వివాదాలను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ నెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు న్యాయ సహాయం అందిస్తూ సంస్థకు, ప్రజలకు వారధిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కట్టా అనంతరెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ ఎన్.భీమార్జున్‌రెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యుడు కట్టా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ ఎం.లెనిన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

బీసీ జేఏసీ చైర్మన్ ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కోసం రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసి చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో 40 కుల సంఘాలకు చెందిన నాయకులు పాల్గొని బీసీ రిజర్వేషన్లపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌కు మాట్లాడుతూ, రిజర్వేషన్ల కోసం బీసీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 1 నుంచి నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుపై చర్చించి ఆమోదింపజేయాలన్నారు. బీసీ బిల్లుపై ప్రధాని మౌనం విడాలన్నారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమం తరహాలో రాష్ట్రంలో మరో బీసీ ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీతో చర్చించాలన్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఆయన ఇంటి ముందు సీఎం రేవంత్‌రెడ్డి ధర్నా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు గుంటోజు వెంకటాచారి, చిలుకరాజు చెన్నయ్య, వైద్యుల సత్యనారాయణ, పాల్వాయి రవి, ఎరుకల శంకర్‌గౌడ్, కర్నాటి యాదగిరి, చెన్నూరి భరద్వాజ యాదవ్, నవీన్‌కుమార్, దుద్దు కృష్ణమూర్తి, అంబటి శివకుమార్, ఖదీర్, పందుల సైదులుగౌడ్, గండిచెరువు వెంకన్న, అయితగోని జనార్దన్, పుట్ట వెంకన్న, మార్గం సతీష్‌కుమార్, ఖమ్మంపాటి శంకర్‌దుర్గ, గడగోజు విజయ్ చారి, చెన్నోజు రాజు, మచ్చ గిరి, నాగరాజ్‌గౌడ్, యాదగిరి, పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

కట్టంగూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కట్టంగూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్లుగా మార్చి కార్మిక వర్గాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్మికుల సమస్యలను చర్చించేందుకు ఈ నెల 29, 30 తేదీల్లో నల్లగొండలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెంజర్ల సైదులు, మాచర్ల యాదమ్మ, కంకణాల శోభరాణి, నాగయ్య, చెవుగోని ధనలక్ష్మి, రేణుక, గద్దపాటి ఎల్లయ్య, శ్రీకాంత్, రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో.. పీఏసీఎస్‌ల భాగస్వామ్యం!



- సాగు విస్తీర్ణం పెంపునకు రైతులతో సదస్సులు
- ప్రతీ పీఏసీఎస్ పరిధిలో 100 ఎకరాల విస్తీర్ణం పెంపు లక్ష్యం
- ఈనెల 11 నుంచి 15 వరకు రైతు వేదికల్లో సమావేశాలు

నార్కట్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంలో ఇక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలూ భాగస్వామ్యం కానున్నాయి. ఆయిల్ పామ్ సాగుతో కలిగే లాభాలు, ఉపయోగాలపై ఉద్యాన, వ్యవసాయశాఖలు వేర్వేరుగా ఇప్పటికే అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాయి. అయినా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు రైతుల నుంచి ఆశించిన మేరకు స్పందన లభించడంలేదు. ఫలితంగా నిర్దేశిత సాగు విస్తీర్ణం లక్ష్యాన్ని చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతుల ద్వారా కొనసాగుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆయిల్‌పామ్ సాగులో భాగస్వామ్యం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు అక్టోబరు 28వ తేదీన సహకారశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రతీ పీఏసీఎస్ పరిధిలో సదస్సులు నిర్వహించనున్నారు.

11 నుంచి 15 వరకు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపు కోసం సహకారశాఖ కమిషనర్ సూచన, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీఏసీఎస్‌లను భాగస్వామ్యం చేస్తూ ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు రైతు సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని 33 మండలాల పరిధిలోని 43 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్లు, సీఈవోలతో పాటు సహకార శాఖ విభాగం నుంచి ఇప్పటికే ఎంపిక చేసిన మానిటరింగ్ అధికారి హాజరుకానున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల నుంచి ఏవో లేదా ఏఈవోలతో నిర్ణీత తేదీల్లో రైతు సదస్సులను ఆయా రైతువేదికల్లో నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ నుంచి ప్రతినిధులు సైతం హాజరు కానున్నారు. పీఏసీఎస్‌ల భాగస్వామ్యంలో ఆయిల్‌పామ్ సాగువైపు రైతులను ప్రోత్సహించడం, సాగు విస్తీర్ణాన్ని పెంచడమే కార్యాచరణ లక్ష్యంగా నాలుగు రోజుల పాటు ఈ సదస్సులు కొనసాగనున్నాయి.

ప్రతీ పీఏసీఎస్‌కు 100 ఎకరాల లక్ష్యం

సాగు పెంపు కోసం ప్రతీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 100 ఎకరాలను లక్ష్యాన్ని నిర్దేశించారు. సంప్రదాయ వరి ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ వైపుకు ఆసక్తి చూపేలా రైతులను ప్రోత్సాహించాలని సహకారశాఖ కమిషనర్ ఆదేశించారు. అందుకు ఉద్యాన, వ్యవసాయ, సహకారశాఖ సిబ్బంది సహాయం తీసుకోవాలని సూచించారు.

టాంటాం వేయిస్తాం



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు భాగస్వామ్యం కావాలని సహకార శాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. కలెక్టర్ సూచనల మేరకు ఈనెల 11 నుంచి 15 వరకు రైతు అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. రైతువేదికల్లో నిర్వహించే ఈ సదస్సు సమాచారాన్ని ఒక రోజు ముందే టాంటాం ద్వారా తెలియజేస్తాం. నార్కట్‌పల్లి పీఏసీఎస్ పరిధిలో 11వ తేదీన, అమ్మనబోలులో 12న, అక్కెనపల్లిలో 13న రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. రైతులు ఈ సదస్సుకు హాజరు కావాలి.

- కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నార్కట్‌పల్లి

నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు జారీ చేయాలి



మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పరమేశ్

మిర్యాలగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడలో మాట్లాడుతూ, గ్రూప్-3, 4 ఉద్యోగులు, ఉపాధ్యాయులు క్రిమిలేయర్ పరిధిలోకి రారని, వారికి నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చాలు మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే సర్టిఫికెట్ జారీ చేయకుండా తహసీల్దార్లు అనర్హులుగా ప్రకటిస్తున్నారని అన్నారు. నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ జారీ విషయంలో ప్రభుత్వం సర్క్యులర్ 424/2014ను తేదీ 31.10.2017న, జీవో ఎంఎస్ నెం.20లో స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. డైరెక్ట్ గ్రూప్-1, 2, సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల వేతనం రూ.8లక్షల పరిమితికి మించినప్పుడు నాన్ క్రిమినల్ సర్టిఫికెట్‌కు అనర్హులు అని అన్నారు. గతంలో బీసీ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను సంప్రదించగా బీసీ సంక్షేమశాఖ ద్వారా అన్ని కార్యాలయాలకు మార్గదర్శకాలు పంపారని అన్నారు. అయినా అధికారులు సర్టిఫికెట్ల జారీ విషయంలో ఇబ్బందులకు గురిచేయడం శోచనీయమన్నారు. ఉద్యోగులకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ జారీచేయని తహసీల్దార్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రానికి రాకుండానే మిల్లుకు

- ధాన్యం తరలింపుపై పలు అనుమానాలు
- అధికారుల తర్జనభర్జన



ఆలగడప ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్ర భవనం

మిర్యాలగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి రాకుండా ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లుకు తరలించడంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు మిర్యాలగూడ మండలం పరిధిలో ఆలగడప, మిర్యాలగూడ, తడకమళ్లకు చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబరు 8న అవంతిపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేశారు. కాగా 15 రోజులుగా రైతులు మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకువస్తుండగా, తేమశాతం తగ్గకపోవడంతో రోజూ ఆరబెడుతూ రాశుల వద్ద కాపలా కాస్తున్నారు. వాతావరణంలో మార్పులతో ధాన్యం ఆరకపోవడంతో ఆదివారం వరకు కాంటాలు ప్రారంభం కాలేదు.

ఆలగడప పీఏసీఎస్ అధికారులు ఈ నెల 4న పట్టణంలోని ఓ రైస్‌మిల్లుకు అన్నారం గ్రామానికి చెందిన ఇరువురు రైతుల పేరుతో ధాన్యం విక్రయించినట్లు వెలుగు చూసింది. ఈ విషయంపై పీఏసీఎస్ అధికారులు లారీ లోడు కొనుగోలు చేశామని, కాంటాలు ప్రారంభం కాలేదని పొంతనలేని సమాధానం చెబుతుండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి మిల్లుకు తరలించారా? లేక కాగితాలపై కొనుగోలు చేసినట్లు సృష్టించారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. అసలు కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లే ప్రారంభం కానప్పుడు నేరుగా ఇద్దరు రైతుల కల్లాల వద్ద కాంటాలు వేసి మిల్లుకు తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆలగడప పీఏసీఎస్ ఇన్‌చార్జి కార్యదర్శి సైదులును ప్రశ్నించగా మండలపరిధిలోని అన్నారం రైతులు ధాన్యాన్ని కల్లాల వద్దే ఆరబెట్టారని, అక్కడే కాంటాలు వేసి ట్రక్‌షీట్ రాసి నేరుగా మిల్లుకు పంపినట్లు తెలిపారు. రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసింది నిజమేనని, అయితే ధాన్యాన్ని ఐకేపీకి తీసుకువచ్చి కాంటా వేయకుండా నేరుగా మిల్లుకు పంపడం తప్పేనని ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు.

నకిలీ బాబాను నిలదీసిన గ్రామస్థులు


నకిలీ బాబాను ప్రశ్నిస్తున్న స్థానికులు

కొండమల్లేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామస్థులో ఓ నకిలీబాబాను ఆదివారం పట్టుకున్నారు. వరంగల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి స్వామిజీగా అని చెప్పుకుంటూ ఆదివారం ఉదయం గ్రామంలో తిరుగుతున్నాడు. శివుడికి అభిషేకం చేయాలంటూ ప్రజల నుంచి నగదు వసూలు చేశాడు. ఈ క్రమంలో ఓ ఇంటికి వెళ్లి ఓ మహిళ నుంచి రూ.100 వసూలు చేయగా మీ ఇంట్లో దుష్ట శక్తి ఉందని, రూ.1000 ఇస్తే ఆ శక్తులను పారదోలుతానని చెప్పాడు. సదరు మహిళ రూ. 1000 ఇచ్చింది. అనంతరం ఈ విషయాన్ని ఆమె తన భర్తకు తెలియజేసింది. అప్పటికే పక్క గ్రామానికి వెళ్లిన నకిలీబాబాను గుమ్మడవెల్లి గ్రామానికి తీసుకువచ్చి గ్రామస్థులు నిలదీశారు. ఈ విషయమై ఎస్‌ఐ అజ్మీరా రమేష్‌ను వివరణ కోరగా అతడికి మతిస్థిమితం సరిగా లేదని, కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు.

అధిక లోడ్‌తో ఉన్న 10 ఆటోలపై జరిమానా

మునగాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న 10 ఆటోలపై జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా మునగాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో ఉదయం 7 గంటల సమయంలో రహదారిపై వరుసగా 10 ఆటోలో పరిమితికి మించి కూలీలను తరలిస్తుండగా ఆటోడ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఆటో, డ్రైవర్లను స్టేషన్‌కు తరలించి డ్రైవర్లకు, కూలీలకు ప్రమాదాల నివారణపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటోలపై మొదటి సారిగా జరిమానా విధించామని, ఇక నుంచి నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేసి, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇక నుంచి పరిమితికి మించి కూలీలను తరలించబోమని ఆటోడ్రైవర్లు హామీ ఇచ్చారు.

మాస్టర్ ప్లాన్ అమలెప్పుడు?

- కాగితాలకే పరిమితమైన ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి
- ఆలయ పునర్విస్తరణ చేపట్టాలని భక్తుల డిమాండ్


దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం (ఇన్‌సెట్‌లో) ఎల్లమ్మ తల్లి

(ఆంధ్రజ్యోతి-కనగల్)

నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మదేవి ఆలయం మాస్టర్ ప్లాన్ కాగితాలకే పరిమితమైంది. మూడున్నర దశాబ్దాల కిందట స్వయంభువుగా పుట్టలో వెలిసిన ఎల్లమ్మదేవత భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. జిల్లాలోని గ్రామ దేవతా ఆలయాల్లో ప్రథమస్థానంలో, ప్రధానఆలయాల్లో నాల్గో స్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం దేవాదాయశాఖ పరిధిలో 6(ఏ) జాబితాలో నమోదై ఉంది. వివిధప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. పండుగలు జరిపి అమ్మవారికి ముడుపులు కడుతారు. బోనాలు సమర్పించి మొక్కు చెల్లిస్తారు. భక్తులు అందించే కానుకలతో పాటు ఆలయం వద్ద నిర్వహించే టెండర్ల ద్వారా ప్రతిఏటా రూ.3కోట్ల వరకు వార్షిక ఆదాయం సమకూరుతోంది.

వసతుల లేమి

దర్వేశిపురంలోని ఎల్లమ్మ ఆలయానికి ఆదాయం ఉన్నా అందుకు అనుగుణంగా భక్తులకు వసతులు లేవు. రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా విస్తరించలేదు. ఆలయంలోపల స్థలం ఇరుకుగా ఉండి భక్తుల పూజలకు సరిపోవటం లేదు. అమ్మవారి ఆలయాన్ని విస్తరించాలని కొన్నాళ్లుగా భక్తులు డిమాండ్ చేస్తున్నారు. నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిని ఈ ఆలయం ఆనుకుని ఉండగా ముఖ్యమైన రోజులు, జాతర, పండగల సందర్భాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తటం పరిపాటిగా మారింది. అధికారుల పర్యవేక్షణ కొరవడి ఆలయం వద్ద వ్యాపారులు తమ దుకాణాలు రోడ్డుపైనా ఏర్పాటు చేసుకోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులకు సౌకర్యార్థం విశ్రాంతి గదులు, సత్రాలు, మెరుగైన తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్న సందర్భంలో గుడి విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారులు రూ.4.5 కోట్లతో మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏడాదికాలం దాటింది. అయితే ఇందుకు సంబంధించి నిధులు విడుదల కాకపోవటంతో మాస్టర్ ప్లాన్ అమలు కాగితాలకే పరిమితమైంది. భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయాన్ని విస్తరించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం



మాస్టర్ ప్లాన్ అమలు, గుడి అభివృద్ధి విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. గత ఏడాది నుంచి ఆలయం వద్ద భక్తుల సౌకర్యాలకు పెద్ద పీట వేస్తున్నాం. ట్రాఫిక్, పారిశుధ్యం, తాగునీటి సరఫరాను మెరుగుపరిచాం. అమ్మవారి భక్తులకు తగు వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం.

- చీదేటి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

భక్తులకు వసతులు కల్పించాలి



అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆలయం వద్ద సరైన వసతులను కల్పించాలి. తాగునీటి సరఫరా, పారిశుధ్య ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలి. మహిళా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. ఆలయ పునర్విస్తరణ చేపట్టాలి.

- విజయలక్ష్మి, భక్తురాలు

శునకాలతో బెంబేలు!

- వీధికుక్కలకు చర్మవ్యాధులు
- గుంపులుగా సంచారం, భయాందోళనలో ప్రజలు

గ్రామాల్లో అన్నిచోట్ల వీధికుక్కల సంచారం పెరిగింది. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. దీనికి తోడు పలుగ్రామాల్లో కుక్కలకు వింత వ్యాధులు సోకి భయంకరంగా మారుతున్నాయి. వీధికుక్కలను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్నారు.

(ఆంధ్రజ్యోతి- పెద్దఅడిశర్లపల్లి)

వీధికుక్కల్లో కొన్నింటికి వింతవ్యాధులు సోకి భయంకరంగా మారుతున్నాయి. గ్రామాల్లో చికెన్, మటన్ దుకాణ యజమానులతో పాటు హోటళ్ల, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడేస్తుండడంతో అవి తిన్న కుక్కలు అంటు వ్యాధుల బారిన పడుతున్నాయి. వ్యాధులబారిన పడిన కుక్కలు కరిస్తే ఏమవుతుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. గజ్జి సోకిన మాదిరిగా వ్యాధుల బారిన పడిన కుక్కలు నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలో పదుల సంఖ్యలో ఉన్నాయి. చిన్నపిల్లలు ఒంటరిగా వెళ్తున్న సమయంలో వెంటపడుతూ దాడికి యత్నిస్తున్నాయి. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని సైతం వెంబడిస్తున్నాయి. ఈ క్రమంలో అదుపు తప్పి ప్రమాదాలకు గురైన వాహనదారులు గాయాలపాలైన సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి వీధికుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.


చర్మ వ్యాధితో వీధికుక్క

పిల్లలు భయపడుతున్నారు



పిల్లలను ఒంటరిగా బయటికి పంపాలంటే భయంగా ఉంది. వీధి కుక్కలు గ్రామాల్లో ప్రమాదకరంగా తిరుగుతున్నాయి. బడికి వెళ్లే పిల్లలు కుక్కల కారణంగా జంకుతున్నారు. దీనికి తోడు కొన్నికుక్కలకు వింత వ్యాధి సోకి చూసేందుకు భయంకరంగా కనిపిస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి వీధికుక్కలకు వ్యాక్సీన్ వేయించాలి. నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

రమావత్ దామోదర్‌నాయక్, అంగడి పేట తండా

పేటలో 10 మందిని కరిచిన కుక్క

సూర్యాపేట క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 43వ వార్డులో ఆదివారం ఓ కుక్క స్వైరవిహారం చేసి 10 మందిని కరిచింది. నెహ్రూనగర్ ప్రాంతంలో పాతబండల బజార్‌లో ఇంటి ముందు కూర్చున్న వెంకటమ్మ అనే మహిళను గాయపరిచింది. అనంతరం వార్డులోని బాతులు, మేకలపై దాడికి పాల్పడింది. అనంతరం వార్డులో వెళ్తున్న సుమారు 9 మంది స్థానికులను కరిచింది. దీంతో స్థానికులు ఏకమై దాడికి పాల్పడిన కుక్కను వెంటాడి చంపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లారు.

భక్తులు ఎక్కువ.. వసతులు తక్కువ

- మరమ్మతుకు నోచుకోని అర్వపల్లి దర్గాకు వెళ్లే రహదారి
- అస్తవ్యస్తంగా షాదీఖానా


తారురోడ్డుకు నోచుకోని దర్గాకు వెళ్లే రహదారి

(ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)

కులమతాలకతీతంగా కొలిచే అర్వపల్లి సమీపంలోని ఖాజా నసీరొద్దిన్ బాబాదర్గా అభివృద్ధికి నోచుకోవడం లేదు. జాజిరెడ్డిగూడెం-అర్వపల్లి గుట్టల మధ్య 70 ఏళ్ల క్రితం వెలుగులోకి వచ్చిన దర్గా నేటికీ సమస్యల వలయంలో ఉంది. దట్టమైన అడవుల్లో ఉన్న దర్గాకు భక్తులు రావడానికి చిన్నపాటి రహదారి ఏర్పాటుచేశారు. ఆ రహదారి బీటీగా మార్చకపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దర్గా వద్ద రేకుల కొట్టాలతో సత్రాలు ఏర్పాటు చేశారు. శాశ్వత భవనాలు నిర్మించ లేదు. వక్ఫ్‌బోర్డు అధికారులు మాత్రం ఉత్సవాల సమయంలో హడావుడి చేసి వెళ్లిపోతున్నారే కానీ ఏనాడూ పట్టించుకోలేదని భక్తులు వాపోతున్నారు. ప్రతీ శుక్రవారం దర్గా వద్దకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తున్నారు. మూత్రశాలలు సరిగా లేకపోవడంతో తీవ్రఅవస్థలు పడుతున్నారు. మహిళ పరిస్థితి మరింత ఇబ్బందిగా తయారైంది. రెండేళ్ల క్రితం నిర్మించిన తాత్కాలిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. భక్తులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటిని సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. షాదీఖానా నిర్మాణ పనులు మధ్యలోనే వదిలేయడంతో నిరుపయోగంగా మారింది.


శిథిలావస్థకు చేరిన మూత్రశాలలు

అభివృద్ధి పనులు చేపట్టాలి



దర్గా వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలి. తాగునీటి వసతి కల్పించాలి. భక్తులు రాత్రి వేళ్లలో ఉండేందుకు సత్రాలు నిర్మించాలి. ఉర్సు ఉత్సవాలు నిర్వహించే సమయంలో హడావుడి చేస్తారు. అసంపూర్తిగా ఉన్న షాదీఖానాను వెంటనే పూర్తి చేయాలి.

కర్కకాని రమేష్, అర్వపల్లి భక్తుడు

స్టవ్‌పై గుడ్లు.. ఇంటికి తాళం

భువనగిరి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏమరుపాటు తీవ్రనష్టానికి దారితీసింది. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రం భువనగిరి పట్టణం అర్బన్‌కాలనీకి చెందిన తడక ప్రమీల కుటుంబం మిర్చి, బజ్జీల బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. ఆదివారం కోడిగుడ్లను ఉడకబెట్టేందుకు స్టవ్‌పై పెట్టి ఇంటికి తాళం వేసి ఇతరవస్తువుల కొనుగోలుకు మార్కెట్‌కువెళ్లారు. మార్కెట్‌లో ఆలస్యం జరగడంతో స్టవ్ నుంచి వెలువడిన మంటలు నిమిషాల వ్యవధిలోనే రెండు గదుల ఇంటికి మొత్తానికి వ్యాపించాయి. బీరువాలో భద్రపరిచిన రూ.లక్ష నగదు, బంగారం ఆభరణాలు, చీరలు సహా గృహోపకరణాలన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. మంటల వ్యాప్తిని గమనించి స్థానికులు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. అగ్నిమాపక వాహనం వచ్చే సమయానికే తీవ్రనష్టం జరిగింది. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన ప్రమీల కుటుంబసభ్యులు దహనం అవుతున్న ఇంటిని చూసి రోదించారు. ప్రమాదంలో రూ.5 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిందని వాపోయింది.

నల్లబెల్లం, పటిక పట్టివేత

భువనగిరి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సారాతయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటికను నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శుక్రవారం అర్ధరాత్రి భువనగిరి బైపాస్ రోడ్డులో పట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పీలేరు నుంచి మహబూబాబాద్‌కు ముడిసరుకు రవాణా అవుతుందన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం భువనగిరి బైపాస్‌రోడ్డుపై కాపుగాసి రూ.60వేలు విలువైన 160కిలోల నల్లబెల్లం, 60కిలోల పటికను స్వాధీనం చేసుకుంది. కర్నూలు జిల్లాకు చెందిన ఎండీ బషీర్, బాణోతు సాయికిరణ్‌ను అరెస్టు చేయగా భూక్య అఖిల్ సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. ఈ మేరకు వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి భువనగిరి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. ఎక్సైజ్ సీఐ రవిచంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ అడ్డగింత

ఆత్మకూరు(ఎస్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని మక్తాకొత్తగూడెం గ్రామంలో ఇసుక ట్రాక్టర్‌ను గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. మోతె మండలం రాయినికుంటతండాకు చెందిన ట్రాక్టర్, మక్తాకొత్తగూడెం ఏటి నుంచి ఇసుక నింపుకొని వెళ్తోంది. స్థానికులు అడ్డుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

● వేములపల్లి: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. రావులపెంట గ్రామానికి చెందిన తం గెళ్ల రవీందర్‌రెడ్డి తన ట్రాక్టర్ ద్వారా మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా మొల్కపట్నం గ్రామ శివారులో పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. రవీందర్‌రెడ్డితో పాటు డ్రైవర్ గుంజ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

ఆత్మకూరు(ఎస్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ వద్ద ఆదివారం కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన 14 మంది మహిళా కూలీలు పత్తి ఏరేందుకు ఆత్మకూరు(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామానికి ఆటోలో వెళ్లి సాయంత్రం తిరిగి ప్రయాణమయ్యారు. తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో బోల్తాకొట్టింది.ఈప్రమాదంలో ఆటోడ్రైవర్ ఎక్కినపల్లి పుల్లయ్యతోట పాటు కూలీలు కూలీలు సలిగంటి నాగమ్మ, ఆకుల సోమమ్మ, అబ్బగాని సత్యవతి, చిత్తలూరు జ్యోతి, శేషగాని రమణ, చిత్తలూరు లక్ష్మమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ పుల్లయ్య, సలిగంటి నాగమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. 108 వాహనంలో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.


ప్రమాదంలో నుజ్జయిన ఆటో, గాయపడిన మహిళా కూలీ

బస్సును ఢీ కొట్టిన లారీ

ఇద్దరు మహిళా ప్రయాణికులకు గాయాలు


బస్సును లారీ ఢీకొట్టడంతో నిలిచిన రాకపోకలు

ఆత్మకూరు(ఎస్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని పాతసూర్యాపేట స్టేజీ సమీపంలో ఆర్టీసీ బస్సును లారీ వెనక నుంచి ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు 40 మందితో తొర్రూరు వెళ్తోంది. పాతసూర్యాపేట స్టేజీ సమీపంలో బస్సును లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏనుబాముల గ్రామానికి చెందిన కల్లెపల్లి ఉపేంద్ర, నెమ్మికల్‌కు చెందిన పురం రాణిలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. లారీడ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి పారిపోయినట్లు తెలిసింది. ఈ ఘటనతో సూర్యాపేట-దంతాలపల్లి మార్గంలో అరగంటకు పైగా రాకపోకలు నిలిచాయి. పోలీసులు వచ్చి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి

మోటకొండూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి చెందడంతో పాటు వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ అశోక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆడెపు సోములు తన నాలుగు గేదెలను వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లి రాయిగిరి-తొర్రూరు ప్రధాన రహదారి వెంట తిరిగి వస్తున్నాడు. ముత్తిరెడ్డిగూడెం వద్ద తొర్రూరు డిపోకు చెందిన టీఎస్26జడ్ 0030 నంబరు గల ఆర్టీసీ బస్సు గేదెను బలంగా ఢీకొట్టింది. నిండు సుడితో ఉన్న గేదె చావు బతుకుల మధ్య నడిరోడ్డుపై కొట్టుమిట్టాడుతూ మృతి చెందింది. గేదెలతో పాటు కాపరికి గాయాలు కావడంతో భువనగిరి ఏరియాఆసుపత్రికి తరలించారు. గేదె విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ స్వర్గం రామూర్తి(53) బస్సు దూకి పరారయ్యాడు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. బస్సులోని ప్రయాణికులు పోలీసులు మరోబస్సులో పంపించేశారు.

ఆలేరులో కారు ఢీకొని యువకుడి మృతి


ఉదయ్(ఫైల్)

ఆలేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ఆదివారం కారు, ద్విచక్రవాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు పట్టణంలోని దళితవాడకు చెందిన ఎర్ర ఉదయ్(22) తన తల్లి మాతమ్మను మునిసిపాలిటీ కార్యాలయం వద్ద దింపేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ఇంటికి చేరుకునేందుకు బయలుదేరాడు. రఘునాథపురం రోడ్డు మీద గుండా బ్రిడ్జిపై వస్తున్న కారు అతడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్ ఎగిరి బ్రిడ్జి పైనుంచి కింద రోడ్డుపై పడ్డాడు. దాంతో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారును స్వాధీనంచేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంఘటనపై సీఐ యాలాద్రి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు. మృతుడు అవివాహితుడు, తల్లిదండ్రులకు రెండవ కుమారుడుగా తెలిసింది.

కారు అదుపుతప్పి వ్యక్తి తీవ్రగాయలు

చిలుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్ర సమీపంలో శనివారం రాత్రి కారు అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ సురేష్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన పులగం వంశీకృష్ణ, అసోజు త్రివాసు, పులగం ప్రశాంత్‌లు కారులో శనివారం ఖమ్మంలో జరిగే ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తున్నారు. కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపునకు వస్తుండగా చిలుకూరు గ్రామశివారులోని పెట్రోల్ బంక్ వద్ద కారు అదుపుతప్పి ముందు ఉన్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వంశీకృష్ణకు తీవ్రగాయాలు మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. కృష్ణను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

మహబూబ్‌బాద్ జిల్లాలో అర్వపల్లి వాసి

మరిపెడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం, ఆటో ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బుర్హాన్‌పురంలో జరిగింది. ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా ఆర్వపల్లి మండలం ఇటిక్యాలపల్లికి చెందిన శివరాత్రి చందు(30) అక్కడికక్కడే మృతి చెందారు. ఖమ్మం జిల్లా సిరిమోరికి చెందిన బత్తుల రాము, బుర్హాన్‌పురానికి చెందిన బండారి లింగమ్మ రెండుకాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. బుర్హాన్‌పురంలోని వడ్డెర కాలనీలో పండుగ వేడుకలు జరుగగా చందు, బత్తుల రాము, బండారి లింగమ్మ అక్కడికి వెళ్లి తిరుగుప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ద్విచక్రవాహనం, ఆటో ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనం వెనుక కూర్చొన్న చందు మృతి చెందాడు. బైక్ నడుపుతున్న రాము రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలకు గురయ్యారు. ఆటోలో ప్రయాణిస్తున్న బండారి లింగమ్మకు సైతం రెండు కాళ్లు విరిగి అపస్మారక స్థితికి చేరుకుంది. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం ఖమ్మం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

విహారయాత్రలో విషాదం

కృష్ణా పుష్కరఘాట్‌లో యువకుడు గల్లంతు


ముజీబ్(ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాదిపాడులోని కృష్ణానది పుష్కరఘాట్‌లో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరికి చెందిన షేక్ ముజీబ్(22), రఫీ, ఖాజా, నాగుల్, జానీపాషా, సాధిక్‌లతో ఆదివారం అచ్చంపేట మండలం మాదిపాడు ప్రాంతంలోని పులిచింతల ప్రాజెక్టు దిగువ భాగం ప్రాంతానికి విహార యాత్రకు వెళ్లారు. అక్కడే ఉన్న పుష్కరఘాట్‌లో స్నానం చేసేందుకు ఉదయం 10గంటలకు ముజీబ్ నీటిలోకి దిగాడు. నీటి ఉధృతికి ముజీబ్ కొట్టుకుపోతుండగా మరో ఇద్దరు స్నేహితులు కాపాడేందుకు నీటిలోకి దిగారు. వీరిద్దరూ కొట్టుకుపోతుండగా జాలర్లు పడవ ద్వారా వెళ్లి కాపాడి ఒడ్డుకు చేర్చారు. ముజీబ్ నీటిలో గల్లంతుకాగా, ఏపీ రాష్ట్రానికి చెందిన పోలీసులు, సహాయక సిబ్బంది(రెస్క్యూ టీమ్) గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. లింగగిరికి చెందిన ముస్తఫాకు ఇద్దరు కుమారులు కాగా, ముజీబ్ పెద్దవాడు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట జిల్లా చింతలపాలెం పోలీసులు పరిశీలించారు.

ఎడమకాల్వలో గల్లంతైన లారీ డ్రైవర్

గరిడేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చేతులు శుభ్రం చేసుకునేందుకు నాగార్జునసాగర్ ఎడమకాల్వలోకి దిగిన లారీ డ్రైవర్ ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా రాజీవ్‌నగర్‌కు చెందిన ఈట శ్రీకాంత్(36) లారీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. చెన్నై నుంచి లారీ లోడుతో మంచిర్యాలకు వెళ్తున్నాడు. గరిడేపల్లి మండలం మర్రికుంట వద్దకు చేరుకోగా లారీని నిలిపి డ్రైవర్, క్లీనర్ ఇతర లారీడ్రైవర్లతో కలిసి వంట చేసుకుని భోజనం చేశాడు. అనంతరం చేతులు శుభ్రం చేసుకునేందుకు కాల్వ ఒడ్డుకు శ్రీకాంత్ చేరుకొన్న క్రమంలో కాలు జారి కాల్వలో పడి గల్లంతయ్యాడు. ఇతర లారీడ్రైవర్లు, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ చరమంద రాజు, ఎస్‌ఐ నరేష్ తన బృందంతో వెళ్లి శ్రీకాంత్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య


సతీష్‌కుమార్(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ అజయ్‌భార్గవ్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణం లక్కారం గ్రామానికి చెందిన రాచకొండ సతీష్‌కుమార్‌చారి సీసీ కెమెరాల రిపేరింగ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇటీవల సతీష్‌కుమార్‌చారికి ఆర్థిక సమస్యలు పెరగడంతో మానసికంగా మనోవేదనకు గురై తీవ్రమనస్తాపంతో శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. భార్య సురేఖ ఆదివారం ఆలస్యంగా చూసి పోలీసులకు సమాచారం అందించింది. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజయ్‌భార్గవ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు వలస కార్మికుడు మృతి

చౌటుప్పల్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ప్రమాదవశాత్తు చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఆకాష్‌కుమార్(22) యాదాద్రీరీలింగ్, ట్విస్టింగ్ పరిశ్రమలో భార్య వర్షకర్మతో కలిసి పనిచేస్తున్నారు. ఆదివారం కట్టర్‌మిషన్‌తో ఐరన్ కట్ చేస్తుండగా ప్రమాదశాత్తు తలకు తగిలి తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా తన భర్త మృతికి పరిశ్రమ యజమాని గంజి మహేష్ కారణమని భార్య వర్షకర్మ ఆరోపించింది. తన భర్తకు ఐరన్ కటింగ్ చేయటం రాకున్నా బలవంతంగా చేయించటంతో మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సాగర్‌లో పర్యాటకుల లాంచీ ప్రయాణం(ఫైల్)

లక్ష్యాన్ని అధిగమించి

● సాగర్‌లో జలవిద్యుత్ ఉత్పత్తి

● ఈ ఏడాది లక్ష్యం 1450 మిలియన్ యూనిట్లు కాగా ఇప్పటికే ఉత్పత్తి 2132.23 మి.యూ ● 3000 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తాం: జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్


సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రం

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ.. ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత కట్టడం. ప్రపంచ పర్యాటక ప్రాంతం నాగార్జునసాగర్ మరో రికార్డు సొంతం చేసుకుంది. జల విద్యుత్ ఉత్పాదనలో లక్ష్యాన్ని అధిగమించి ఉత్పత్తి చేసింది. ఈ ఏడాది 1450 మిలియన్ యూనిట్లకు 2132 యూనిట్లు ఉత్పత్తి చేసి, ఏడాది చివరి నాటికి 3000 యూనిట్ల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)


నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1,450 మిలియన్ యూనిట్లు కాగా, ఆదివారం సాయంత్రానికి 2132.23 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని సీఈ మంగేష్ కుమార్ 'ఆంధ్రజ్యోతి' తో తెలిపారు. దీంతో జెన్‌కోకు ఇప్పటి వరకు రూ.450కోట్ల ఆదాయం సమకూరినట్లు సీఈ వివరించారు. 18 ఏళ్ల తర్వాత ఈ ఏడాది సాగర్‌కు జూలై నెలలో వరద రావడంతో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని జూలై 29వ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 1,450 మిలియన్ యూనిట్లు కాగా రెండు నెలల్లో సెప్టెంబరు 30వ తేదీ మధ్యాహ్నం నాటికి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నట్లు వివరించారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్‌లు ఉండగా ఒక్కో టర్బైన్ నుంచి 100 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాగర్‌కు ఎగువనుంచి వరద రాకపోవడంతో ఆ ఏడాది ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో ఆ ఏడాది లక్ష్యం 1,400 మిలియన్ యూనిట్లు కాగా, కేవలం 540.83 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే ఉత్పత్తి చేసినట్లు సీఈ తెలిపారు.

గత ఆరేళ్లలో విద్యుత్ ఉత్పత్తి

నీటి సంవత్సరం	లక్ష్యం(మి.యూ)	ఉత్పత్తి
2019-20	1289	1512.85
2020-21	1248	2262.68
2021-22	1535	2262.62
2022-23	1500	2355.63
2023-24	1400	540.83
2024-25	1400	1922
2025-26	1450	2132.23

ఐదు సార్లు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది మే 31 వరకు) నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను 18ఏళ్ల తర్వాత జూలై 29వ తేదీ ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత ఎగువనుంచి వరద రాకను బట్టి గేట్లు ఎత్తుతూ, దించుతూ మొత్తం ఐదు విడతలు గేట్లను ఎత్తి సాగర్ నుంచి దిగువకు విడుదల చేశారు. ఈ ఐదు విడతల్లో గేట్ల ద్వారా 1,148 టీఎంసీల నీరు దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.


(ఫైల్)

సాగర్ గేట్లు ఎత్తారు ఇలా..

- మొదటిసారి జూలై 29నుంచి ఆగస్టు 4 తేదీ వరకు
- రెండోసారి ఆగస్టు 10నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు
- మూడోసారి సెప్టెంబరు 7 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు
- నాలుగోసారి అక్టోబరు 8నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు
- ఐదోసారి అక్టోబరు 30నుంచి నవంబరు 8వ తేదీ వరకు

3000 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి



సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది ఉన్నతాధికారులు నిర్ణయించిన 1,450 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని రెండు నెలల్లో చేరుకున్నాం. ఎగువనుంచి వరద రాక మరో రెండు నెలలు ఇలాగే కొనసాగితే ఈ ఏడాది 3000 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాం. దీంతో జెన్‌కోకు సుమారు రూ.1500కోట్ల ఆదాయం సమకూరుతుంది.

మంగేష్ కుమార్, జెన్‌కో సీఈ

పర్యాటక శాఖకు భలే గిరాకీ

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ పర్యాటకశాఖకు ఈ ఏడాది భలే గిరాకీ వచ్చినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. జలాశయం నిండటంతో ఈ ఏడాది జూలై 29వ తేదీన సాగర్ క్రస్ట్‌గేట్లను ఎత్తడంతో రెండు తెలుగు రాష్ట్రాలనుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించేందుకు తరలివచ్చారు. దీంతో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రతీరోజు(శుక్రవారం మినహా) లాంచీలు నడిపారు. దీంతో పర్యాటక శాఖకు కూడా భారీ ఆదాయం సమకూరినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. అంతేకాకుండా సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతమైన బుద్ధవనం సందర్శనకు కూడా భారీగా పర్యాటకులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో గతంలో ఎన్నడూలేని విధంగా బుద్ధవనానికి కూడా ఆదాయం సమకూరినట్లు అధికారులు వివరించారు.

వంద రోజులుగా నిరంతరాయంగా..

నాగార్జునసాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో వంద రోజులుగా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో 100 మెగావాట్ల సామర్థ్యంగల ఎనిమిది టర్బైన్‌లున్నాయని, అందులో 7వ టర్బైన్ ద్వారా వంద రోజులుగా ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా 240 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందన్నారు. మిగిలిన 7 టర్బైన్‌లో వంద రోజుల్లో మధ్య మధ్యలో ఆపామని, 7వ టర్బైన్ మాత్రం ఏ ఒక్క రోజు కూడా ఆపలేదన్నారు.

కుచ్చుటోపీ

కుట్టు మిషన్ శిక్షణ పేరుతో...

● పేద మహిళలకు లోన్ మంజూరు చేయిస్తానని రూ.లక్షల్లో వసూలు

కేర్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్.. ఈ పేరును నమ్మిన మహిళలు నిండా మునిగారు. పక్కా ప్రణాళికతో నిర్వాహకుడు తొలుత కుట్టు మిషన్ శిక్షణ అంటూ ముందుకొచ్చాడు. శిక్షణ పూర్తి చేసుకున్నాక సర్టిఫికెట్లు అందజేశాడు. తర్వాత రుణాలు ఇప్పిస్తా.. మీరు కొన్ని డబ్బులు ఇస్తేనే.. రుణం మంజూరు అవుతుందంటూ నమ్మబలికాడు. అతని మాటలు విన్న మహిళలు ఒక్కొక్కరు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఇచ్చారు. తీరా చూస్తే రుణం లేదు.. నిర్వాహకుడు లేడు. వివరాల్లోకి వెళితే..

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిరోడ్డులోని గ్రామీణ బ్యాంకు సమీపంలో కేర్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటైంది. గత జూన్ నెలలో నిర్వాహకుడు అశోక్‌రెడ్డి దీన్ని ఏర్పాటు చేశాడు. మిర్యాలగూడ, నల్లగొండ డివిజన్లలోని మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో ట్రస్ట్ పేరిట కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేశాడు. కుట్టుమిషన్‌సహా వచ్చి స్థానిక మహిళలకు నేర్పినందుకుగాను కుట్టుమిషన్‌కు రోజుకు రూ.500, కుట్టుమిషన్ కేంద్రానికి రూ.1000-1500 వరకు అద్దె చెల్లించేవాడు. ఒక్కో కేంద్రంలో 15-20 మంది చొప్పున గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి పొందేందుకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించాడు. రెండునెలల శిక్షణ అనంతరం వారికి నైపుణ్య సర్టిఫికెట్లను అందజేశాడు. చారిటబుల్ ట్రస్ట్ కింద అనాథలు, పేదలకు సహాయ కార్యక్రమాలు చేపడుతున్నామని, టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలు ఇతర గ్రామాల్లో 20 మంది వరకు మహిళలను సమీకరించి టైలరింగ్ శిక్షణ తీసుకునేలా చేయాలన్నాడు. సంస్థ గుర్తింపు కార్డులు ఇచ్చి నెలవారీగా రూ.8వేల చొప్పున జీతాలు చెల్లిస్తానని, బ్లౌజ్ పీస్ వర్క్‌కూడా ఇప్పిస్తానని చెప్పినట్లు తెలిసింది. ఉపాధి కోసం కొంత మంది మహిళలకు రుణం కూడా ఇప్పించాడు. అందులో సగం మాఫీ చేస్తారు, మిగతా సగం మాత్రమే మీరు చెల్లించాల్సి ఉంటుందని మహిళలను నమ్మించినట్లు సమాచారం. రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు రుణం పొందాలను కుంటే తప్పనిసరిగా ఐటీ ఉండాలని, అందుకోసం ముందుగా డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మిర్యాలగూడ, నల్లగొండ ఇతర ప్రాంతాల్లోని పలువురు మహిళలు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు సదరు వ్యక్తికి చెల్లించినట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా 100కు పైగా మహిళలు రుణాలకోసం ఐటీ పేర అతడికి డబ్బులు చెల్లించినట్లు సమాచారం. నెలరోజుల్లో అతను కార్యాలయం మూసి కనిపించకుండా పోవడంతో బయటకు చెబితే తమ డబ్బులు పూర్తిగా రాకుండా పోతాయేమోనని సదరు మహిళలు వాపోతున్నట్లు తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేయాలా? లేక కోర్టును ఆశ్రయించాలా? అనే విషయమై మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం.



ట్రస్ట్ పేరుతో చెక్కులు

రూ.2 లక్షలు చెల్లించిన మహిళ నెలరోజుల తర్వాత గత సెప్టెంబరులో రుణం ఎప్పుడు మంజూరు చేస్తారని సదరు అశోక్‌రెడ్డిని నిలదీశారు. దీంతో చెక్కుపై తేదీ, నగదు మొత్తం వేయకుండా సంతకం చేసిన చారిటబుల్ ట్రస్టు పేరుతో ఉన్న యూకో బ్యాంకు చెక్కును ఇచ్చాడు. రుణం మంజూరుకాగానే ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అప్పుడు డ్రా చేసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. ఇది జరిగిన కొన్ని రోజుల్లోనే కార్యాలయం ఖాళీచేసి వెళ్లిపోయాడని సదరు మహిళలు ఆరోపిస్తున్నారు. బాధిత మహిళ మిర్యాలగూడ యూకో బ్యాంకుకు వెళ్లి చెక్కు అమౌంట్ గురించి ఆరా తీయగా ఖాతాలో కేవలం రూ.25 మాత్రమే ఉన్నట్లు తెలిసింది.

ఆరేళ్ల క్రితమే ఖాళీ చేసినట్లు

నిర్వాహకుడు అశోక్‌రెడ్డి ఇచ్చిన రెండు, మూడు మొబైల్ నెంబర్లకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తున్నట్లు సమాచారం. అతడి ఆధార్ నెంబర్ పై ఉన్న అడ్రస్ ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేట మటన్ మార్కెట్ ఏరియాకు వెళ్లిన బాధిత మహిళలు సమాచారం కోసం ప్రయత్నించగా.. అడ్రస్ ఉన్న ఇంటిని ఆరేళ్ల క్రితమే అతను ఖాళీ చేసి వెళ్లినట్లు తెలిసింది. దీంతో తాము మోసపోయినట్లు గ్రహించి లబోదిబోమంటున్నారు. తాము కష్టపడి తినితినక కూడబెట్టుకున్న సొమ్మును అన్యాయంగా దోచుకపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. పై విషయమై పోలీసులను సంప్రదించగా, ఎలాంటి సమాచారం లేదని తెలిసింది.

ఏం చేయాలో దిక్కుతోచడం లేదు

రుణం ఇప్పిస్తామంటే నమ్మి మోసపోయా. డబ్బులు వస్తే లేడీస్ ఎంపోరియం ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా స్థిరపడదామనుకున్నా. ట్రస్ట్ పేరుతో పేదలకు సేవ చేస్తానని డబ్బులు దోచుకుంటాడని అనుకోలే. అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగేలా చూడాలి.

బాధిత మహిళ, మిర్యాలగూడ నియోజకవర్గం

చలి పెరుగుతోంది

(5వ పేజీ తరువాయి)

అత్యవసరమైతే తప్ప పొగమంచు సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలి.

- చలి నుంచి కాపాడుకునేందుకు జింక్ ఎక్కువగా ఉండే బాదం, తదితర ఆహారం తీసుకోవాలి.
- ఎప్పటికప్పుడూ వేడి ఆహారాన్ని తీసుకోవాలి.
- పిల్లలకు టోపీలు, గ్లౌజ్‌లు వేసి వెచ్చగా ఉండేలా చూడాలి.
- చలి అధికంగా ఉన్న సమయంలో పాఠశాలలకు వెళ్లే పిల్లలు యూనిఫాంపై జర్కిన్ లేదా కోట్, మంకీ క్యాప్ ధరించేలా చూడాలి.

వారం రోజుల ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్ఠ	గరిష్ఠ
3న	21.0	30.0
4న	21.4	28.5
5న	21.0	29.5
6న	22.0	30.0
7న	23.0	30.5
8న	29.5	21.0
9న	30.0	20.0

శాలిగౌరారం: మండలంలో రెండు రోజులుగా వాతావరణం మార్పుతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శాలిగౌరారం మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో చలి తీవ్రత పెరిగింది. పొగమంచు రావడంతో రోడ్ల మీద వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి పోటీలు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలల సొసైటీ ఆధ్వర్యంలో భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. హైదరాబాద్ జిల్లాస్థాయి అండర్-17 క్రీడాపోటీల్లో మలక్‌పేట విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. గెలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీసీవో మలక్‌పేట, కార్వాన్ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్రావ్, ఏటీపీ హరికుమార్, డీడబ్ల్యూ ఎండీ అజార్, పీఈటీలు హేమలత, సతీష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

● హైవేపై నిదానంగా వెళుతున్న వాహనాలు

చిట్యాలరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-హైదరాబాద్ 65వ నెంబరు జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాలలో ఆదివారం రాత్రి వాహనాల రద్దీ పెరిగింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లిన ప్రజలు తిరుగు ప్రయాణం కావడంతో వాహనాలు రహదారిపై భారీగా చేరుకున్నాయి. చిట్యాల, పెద్దకాపర్తిలో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనాలు నెమ్మదిగా వెళుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 10గంటల వరకు వాహన రద్దీ కొనసాగింది. రహదారిపై వాహనాలు నిదానంగా వెళుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వాహనాలు నిలిచిపోకుండా నార్కట్‌పల్లి సీఐ నాగరాజు పర్యవేక్షణలో చిట్యాల ఏఎస్ఐ వెంకటయ్య సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.


చిట్యాల మీదుగా హైదరాబాద్ వైపు భారీగా వెళ్తున్న వాహనాలు

జన సందోహం.. నృసింహ క్షేత్రం

● ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు.. ధర్మదర్శనానికి మూడున్నర గంటల సమయం ● ఒకే రోజులో రూ.కోటి దాటిన ఆదాయం


క్యూలైన్లలో భక్తుల రద్దీ, ప్రత్యేక అలంకారంలో స్వామి



యాదగిరిగుట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం జనసందోహంగా మారింది. కార్తీక శనివారం, ఆదివారం సెలవు దినం కలిసిరావడంతో సత్యదేవుడి వ్రతాలు, కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండకింద ఆధ్యాత్మికవాడలో 1,758 సత్యదేవుడి వ్రతాలు జరిపించి కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 88వేల మంది భక్తులకు ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శనం) క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు కిక్కిరిశాయి. ప్రత్యేక దర్శనాలకు రెండు గంటలు, ధర్మదర్శనాలకు మూడున్నర గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కొండపైకి, కిందకు భక్తులను తరలించేందుకు అధికారులు తగినన్ని బస్సులు ఏర్పాటు చేసినా బస్టాండుల్లో, ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం ఆరగింపు సమయాలు కలిపి మూడు గంటలపాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తులు వేచి ఉన్నారు. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద కూడా భక్తుల రద్దీ కనిపించింది. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. నృసింహ క్షేత్రంలో నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన సుజాత, హైదరాబాద్‌కు చెందిన అక్షరతోపాటు సుమారు 10 మంది భక్తులు తప్పిపోగా, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రికార్డు స్థాయిలో నిత్యాదాయం.. రూ.కోటిపైనే

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి భక్తులనుంచి ఒక్కరోజే రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. వివిధ విభాగాల ద్వారా రూ.1,00,57,322 ఆదాయం వచ్చింది. ప్రధాన బుకింగ్ 4.87లక్షలు, సత్యదేవుని వ్రతాలు 16.09లక్షలు, వీఐపీ దర్శనం 16.95లక్షలు, కొండపైకి వాహనాల ప్రవేశం రూ.9.17లక్షలు, ప్రసాదాల ద్వారా రూ.27.43లక్షల ఆదాయం సమకూరింది. ఆదివారం నమోదైన ఆదాయం అత్యధిక ఆదాయంగా ఘనత సాధించినట్లు దేవస్థాన ఈవో వెంకట్రావు తెలిపారు.

చెర్వుగట్టుపై కార్తీక భక్తుల రద్దీ



నార్కట్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ కన్పించింది. కార్తీక మాసం శని, ఆదివారాలు వరుస రెండు రోజులు సెలవు రావడంతో క్షేత్ర సందర్శనకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. వ్రతమండపంలో పలువురు దంపతులు సామూహిక సత్యదేవుని వ్రతాలను ఆచరించారు.

శాస్త్రోక్తంగా మట్టపల్లివాసుడి కల్యాణం

మఠంపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణం ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, నిత్య కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన తెగి.. అష్టకష్టాలు

● ఊరబాయితండా, గాజుబేడంతండాల మధ్య స్తంభించిన రాకపోకలు


గాజుబేడంతండా


ఉధృతంగా ప్రవహిస్తున్న ఊరబాయితండా, గాజుబేడం తండాల మధ్య వాగు

కుటుంబాలు 55.. రోజులు 15.. అటు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఊరుదాటి వెళ్దామంటే వాగు అడ్డొస్తుంది. ఎవరికైనా చెప్దామంటే సెల్‌ఫోన్లకు సరైన నెట్‌వర్క్ అందదు. దీంతో వారు పడిన కష్టాలు వర్ణనాతీతం. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలోని రెండు తండాల ప్రజల దుస్థితి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

(ఆంధ్రజ్యోతి-నేరేడుగొమ్ము)

మొంథా తుఫాను కారణంగా ఇటీవల కురిసిన వర్షాలతో నేరేడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఊరబాయితండా, గాజుబేడంతండాల మధ్య వంతెన తెగి, రాకపోకలు నిలిచిపోయాయి. ఇరవై రోజుల క్రితం ఊరబాయితండా, గాజుబేడంతండా మధ్యలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ తండా మధ్యలో ఉన్న లోలెవల్ వంతెన తెగిపోయింది. అక్కడ ఉన్న 55 కుటుంబాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా పోయాయి. ఇక్కడ సెల్ టవర్లనుంచి సిగ్నల్ రాకపోవడంతో వారు ఎవరికీ సమాచారం ఇవ్వలేకపోయారు. ఇప్పుడిప్పుడే వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన వద్ద రోడ్డంతా ధ్వంసం కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఊరబాయి తండా నుంచి గాజుబేడంతండాకు పోవాలంటే తెగిన వంతెన దాటి వాగు పారుతుండడంతో గాజుబేడంతండా వాసులకు ఇటు వాగుదాటి రావడం ప్రాణసంకటంగా మారింది. దీంతో వాహనాలకు వంతెన తెగి రోడ్డు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

నిత్యావసర సరులు లేక ఇబ్బందులు

వరద దాటికి వంతెన తెగిపోవడంతో ఊరబాయితండా, గాజుబెడం తండాలోని గిరిజనులు నిత్యావసర సరుకులు లేక అష్టకష్టాలు పడుతున్నారు. ఆయా తండాలకు చెందిన విద్యార్థులు కూడా 20రోజులుగా పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు నెల నుంచి కృష్ణానీటి సరఫరా నిలిచిపోవడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నామని ఆయా తండావాసులు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

70 ఏళ్లుగా తండాల్లో ఉంటున్న తమకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తండాలవాసులు వాపోతున్నారు. రెండు తండాల మధ్య 15 రోజులుగా రాకపోకలు బంద్ అయినా ఏ ఒక్క అధికారి తమ తండాల వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికార యంత్రాంగం స్పందించి రెండుతండాల మధ్య ధ్వంసమైన వంతెనకు మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా తండాలవాసులు కోరుతున్నారు.

సరుకులు లేక ఇబ్బందులు



15 రోజులుగా మాతండాకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ఉధృతంగా ప్రవహించడంతో వంతెన తెగిన ప్రదేశం నుంచి కాలినడకన ఇబ్బందులు పడుతూ రావాల్సిన దుస్థితి. కూరగాయలు లేక కారంతో అన్నం తింటున్నాం.

కమిలి, గాజుబేడంతండా.

బడికిపోక 15 రోజులైంది



తుఫాను ప్రభావంతో వచ్చిన వర్షాలకు తండాకు వచ్చే వంతెన తెగిపోయింది. బడికి పోక 15 రోజులైంది. వానాకాలం వచ్చిందంటే ఇబ్బందులు పడుతున్నాం. వంతెన వద్ద బ్రిడ్జి నిర్మించాలి.

చంద్రశేఖర్, మూడో తరగతి, గాజుబేడంతండా.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో పుట్‌ఓవర్ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని అబ్బాసియాకాలనీ, కాపురాలగుట్ట, శివరాంనగర్, సిద్దార్థకాలనీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చిట్యాల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా యువజన క్రీడల శాఖాధికారి మహ్మద్ అక్బర్ కోరారు. చిట్యాలలో కైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కలర్ బెల్ట్ పోటీల్లో విజేతలకు ఆయన బెల్ట్‌లు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడల్లో రాణించడం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కైక్వాండో మాస్టర్ పట్టెడ సుధాకర్, కోచ్ ఫణీంద్రకుమార్, వైష్ణవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

మర్రిగూడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. మండలంలోని శివన్నగూడ గ్రామంలో రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం అకాల వర్షాల వల్ల తడిసి ముద్దయిందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. కొనుగోలు కేంద్రాలు తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని కొనుగోలులో రైతులకు కొర్రీలు, షరతులు పెడుతూ ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. ప్రభుత్వం గతంలో ధాన్యానికి రూ.500 బోనస్ కల్పిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయడంలేదని వారు ఆరోపించారు. వరి ధాన్యానికి వెంటనే రూ.500 బోనస్ అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వెంటనే రైస్ మిల్లుల కేటాయించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని రాశులుగా పోశారని కేంద్రం ప్రారంభించి వారం రోజులవుతున్నా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. వెంటనే కొనుగోలు ప్రారంభించి తేమశాతం వచ్చిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని ఆయన కోరారు. ఆయన వెంట నాంపల్లి చంద్రమౌళి, సీపీఐ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, రాఘవేంద్ర, ఎరుకలి శివ, సత్తయ్య, రాంబాబు ఉన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బండ శ్రీశైలం

వైభవంగా భక్తుల మొక్కుబడి కల్యాణం



మొక్కుబడి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి కార్తీకమాస భక్తుల రద్దీ కొనసాగుతుంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్య అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో మొక్కుబడి కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. చీరసారె, ఒడి బియ్యం సమర్పించి బోనవైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

వాసవీమాత ఆలయంలో కుంకుమపూజ



వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

నకిరేకల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ పట్టణంలోని మూసీరోడ్డులో గల వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వాసవీమాత ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమ పూజలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హారతి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ జిల్లా మాజీ గవర్నర్, ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మీకమలాకర్, ఆలయ కమిటీ ప్రతినిధులు, బ్రహ్మదేవర లక్ష్మయ్య, బ్రహ్మదేవర పద్మ, కమల నరసింహారావు, రేపాల సతీష్, కోటగిరి రవి, కృష్ణ లావణ్య, బ్రహ్మదేవర వేణు, వీర్లపాటి నర్సింహారావు, బ్రహ్మదేవర రామ్మోహన్, గర్రె మురళి, కోటగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల కార్తీక వనభోజనాలు



వనభోజనాల వేడుకలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న మహిళలు

నార్కట్‌పల్లి, నవంబరు 9, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంపై నార్కట్‌పల్లి ఆర్యవైశ్యులు కార్తీక వనభోజనాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్తీక సమారాధనలో భాగంగా వైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గుట్టపై హరిహరులను దర్శించుకుని భక్తితో కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం వినోదాన్ని కలిగించే ఆటలతో అంతా సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బిల్లకంటి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్, మండల గౌరవాధ్యక్షుడు ఇడుకుళ్ల బిక్షమయ్య, మాజీ అధ్యక్షుడు పాల్వాయి భాస్కర్‌రావు, యువజన విభాగం మండల, పట్టణ అధ్యక్షులు ఇడుకుళ్ల సంపత్, రంగా సంపత్, మహిళా విభాగం అధ్యక్షురాలు కర్నాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో కట్టంగూరు విద్యార్థినికి సీటు

కట్టంగూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కట్టంగూరుకు చెందిన బుడిగ జాహ్నవి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో సిద్ధిపేటలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రభుత్వ కోటాలో ఉచితంగా సీటు వచ్చింది. జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 489 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 904 ర్యాంకు సాధించింది. జాహ్నవి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. నిరుపేద కుటుంబానికి చెందిన జాహ్నవి తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు.



బుడిగ జాహ్నవి

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

శాలిగౌరారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకుల పహాడ్ గ్రామానికి చెందిన తాటిపాముల మంగమ్మ, గర్దాస్ పాపమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఛైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ తన తండ్రి యంగలి అంజయ్య జ్ఞాపకార్థం మృతి చెందిన మంగమ్మ, పాపమ్మ కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై తిరగబడాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ సలీం

నల్లగొండరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం తిరగబడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన నల్లగొండ పట్టణంలోని ఎగుమతి, దిగుమతి హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులు హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. 1970లో ఐక్యత పోరాటం నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందని, ఆనాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి డి.సత్తయ్య, రవీందర్, మారయ్య, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో ఆంక్షలు ఎత్తివేయాలి

- రైతు సంఘం మహిళా రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల



సమావేశంలో మాట్లాడుతున్న కందాల ప్రమీల

కట్టంగూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆంక్షలను వెంటనే ఎత్తి వేయాలని రైతు సంఘం మహిళా రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు. కట్టంగూరులోని అమరవీరుల స్మారక భవన్‌లో ఆదివారం జరిగిన రైతు సంఘం నాలుగో మండల మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోళ్లను ఆలస్యంగా ప్రారంభించడమే కాకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా నిబంధనలు పెట్టిందన్నారు. గతంలో ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు పత్తి కొనుగోలు చేసే వారని ఇప్పుడు 7క్వింటాళ్లకు తగ్గించడం వల్ల రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఎన్నం నర్సిరెడ్డి, మురారి మోహన్, నంద్యాల అనంతరెడ్డి, గద్దపాటి ఎల్లయ్య, కృష్ణ, లక్ష్మీనారాయణ, సుజాత, రఘురాంరెడ్డి, సైదులు, యాదయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- అదనపు ఎస్పీ రమేష్



వైద్య శిబిరంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, డాక్టర్లు

నల్లగొండ క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకూడదని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. చర్లపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రికి పోలేని పరిస్థితుల్లో వారిని దృష్టిలో ఉంచుకొని వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరమని, అదేవిధంగా ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. సమాజంలో ఉన్న రుగ్మతలను పారదోలడానికి యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ సర్పంచ్ మేడి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సైదాబాబు, డాక్టర్ పుల్లారావు, శ్రీధర్, సంపద, వీరస్వామి, ఝాన్సీరాణి, కోట సరిత, పిచ్చయ్య, కరుణాదేవి, సత్తిరెడ్డి, సాధిక్ పాషా, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ఐద్వా కృషి

- ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి అనురాధ



అనంతారం గ్రామంలో ప్రచారం చేస్తున్న అనురాధ

నల్లగొండరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధికి ఐద్వా నిరంతరం కృషి చేస్తుందని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ అన్నారు. మహిళల సమగ్రాభివృద్ధి కోసం ఐద్వా చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని అనంతారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ మహిళ అభ్యున్నతి కోసం విభిన్న రూపాల్లో నిరంతరం ఐద్వా కృషి చేస్తుందని అన్నారు. జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగబోయే ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు పద్మ, శాంతమ్మ, గోపమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల సంగీత కచేరి



విద్యార్థినులను సన్మానించిన ఈవో మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని శ్రీ కీర్తన సంగీత అకాడమీ, నల్లగొండలోని మౌంట్ లిటెరా జీ స్కూల్‌కు చెందిన సంగీత విద్యార్థులు ఆదివారం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సంగీత కచేరీ నిర్వహించారు. సంగీతం నేర్చుకుంటున్న అకాడమీ విద్యార్థినులు దేవస్థానం మహామంటపంలో భక్తి గీతాలను ఆలపించి భక్తులను అబ్బురపరిచారు. తమ గానలహరితో అలరించిన సంగీత విద్యార్థులందరినీ దేవస్థానం ఈవో సల్వాది మోహన్‌బాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి సన్మానించారు.

15 రోజుల్లో.. 1,476 మెట్రిక్ టన్నులే!

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేయని సీసీఐ, దళారుల నుంచి మాత్రం కొర్రీలు లేకుండా కొనుగోలు చేస్తుండటం గమనార్హం. కొంతమంది దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ధర ఎక్కువగా వచ్చినప్పుడు విక్రయించేందుకు నిల్వ చేస్తున్నారు. రైతులకు ప్రయోజనంలేని ప్రభుత్వరంగ సంస్థలు దళారులకు ఉపయోగపడేలా వ్యవహరిస్తున్నాయని సీసీఐపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో ప్రారంభంకాని కొనుగోళ్లు

ఎల్-1, ఎల్-2, ఎల్-3 అనే నిబంధనలతో కొన్ని జిన్నింగ్ మిల్లులతో మాత్రమే కొనుగోళ్ల ప్రారంభించిన సీసీఐ ఇంకా పూర్తి స్థాయిలో కొనుగోళ్ల ప్రారంభించలేదు. దీంతో చాలా మండలాల్లో రైతులకు జిన్నింగ్ మిల్లులు అందుబాటులో లేక దూర ప్రాంతాల మిల్లులకు విక్రయించాలనే ఆలోచన చేయకుండా దళారులకు విక్రయిస్తున్నారు. ఆయా మండలాల రైతులకు సీసీఐ కొనుగోలు చేసే జిన్నింగ్ మిల్లులు అందుబాటులో ఉంటే సమస్య ఉండేది కాదు. అందుకు విరుద్ధంగా కేవలం 15మిల్లుల్లో మాత్రమే సీసీఐ కొనుగోళ్ల చేపడుతోంది. ఇంకా తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో అసలు కొనుగోళ్లే ప్రారంభం కాలేదు. ప్రారంభమైన జిన్నింగ్ మిల్లుల్లో 50శాతం కొనుగోళ్లు దాటితేనే సీసీఐ మరో జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్ల ప్రారంభిస్తుందని తెలిసింది. ఇప్పటికే కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని సీసీఐ కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ తీరుపై జిన్నింగ్ మిల్లుల యజమానులు సైతం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కావాలనే జిన్నింగ్ మిల్లుల యజమానులను ఇబ్బందులకు గురిచేయడం కోసమే సీసీఐ ఆంక్షలు విధిస్తోందని వాపోతున్నారు. కొనుగోళ్లు సాఫీగా చేయాల్సిన సీసీఐ కేవలం మొక్కుబడిగా వ్యవహరిస్తూ సమస్యలకు గురిచేస్తోందని రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా వ్యవహరిస్తోందని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఉన్న దిగుబడులైనా సకాలంలో కొనుగోలు చేస్తే రైతులకు కనీసం పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో కురిసిన వర్షాలు పత్తిని దెబ్బతీయగా, వచ్చిన కాస్త దిగుబడినైనా విక్రయిద్దామంటే సీసీఐ సహకరించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రజా చైతన్యమే ప్రజానాట్యమండలి లక్ష్యం

- ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్



ప్రజానాట్యమండలి మండల మహసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శంకర్

చిట్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యవంతం చేయడమే ప్రజానాట్యమండలి లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన ప్రజా నాట్యమండలి మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కళ కాసుల కోసం కాదు పీడిత ప్రజల సంక్షేమం కోసమని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలను చైతన్యం చేయడంతో పాటు పాలకవర్గ విధానాలను ప్రజలకు వివరించేందుకు ప్రజానాట్యమండలి కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మండలి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడి లింగస్వామి, కార్యదర్శి జిట్ట స్వామి, ఉపాధ్యక్షులు పేర్వారం రాములు, వీరమల్ల మణెమ్మ, ఎం. నవీన్ కుమార్, సహాయ కార్యదర్శులుగా నాగిళ్ల కిరణ్, పెరిక సరిత, మేడి రాంబాబు, కోశాధికారి గుండె పరమేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు చింత విజయ, రుద్రారపు పార్వతమ్మ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



లక్ష్మీపురం కాలనీలో చలిదుప్పట్లను పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

నార్కట్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చిట్యాల పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నార్కట్‌పల్లిలో గల లక్ష్మీపురం కాలనీకి చెందిన పేదలకు చలి దుప్పట్లు అందజేశారు. సుమారు 80 మందికి చలి దుప్పట్లతో పాటు పులిహోర, లడ్డు ప్రసాదాలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సంస్థ సభ్యులు ఝాన్సీ, నాగలక్ష్మి, జ్యోతి, జయస్పందన, జనమ్మ, నాగమణి, అంజయ్య, అనిల్‌కుమార్ నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి, యానాల రాంరెడ్డి, వెంకన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం రేపు

నల్లగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 11వ తేదీన జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రహరి రామరాజు, నేలపట్ల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అన్ని సంఘాల నాయకులు, ప్రజాసంఘాలు నాయకులు హాజరుకావాలని వారు కోరారు.


రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

నల్లగొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని డీసీవో పత్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో 17శాతం లోపు తేమశాతం వచ్చిన పచ్చి తాలు లేని ధాన్యాన్ని అదే రోజు మిల్లులకు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. వర్షాల కారణంగా రంగుమారిన ధాన్యాన్ని జిల్లా అధికారులతో టెక్నికల్ టీమ్‌లతో చర్చించి మిల్లులకు తరలిస్తామని పేర్కొన్నారు.

నిత్యాన్నదానం కోసం రూ.61,116 విరాళం

నార్కట్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకం కోసం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన వాస్తవ్యులు, మహంకాళి వైన్స్ యజమాని రూ.61,116లను విరాళంగా అందజేసినట్లు ఈవో సల్వాది మోహన్‌బాబు తెలిపారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
5
సోమవారం 10 నవంబరు 2025
గరిష్ఠం 30.0
కనిష్ఠం 20.0



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.30 (309.9534)	51,139	51,139
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,132.84	3,983.93
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.818 (43.9377)	38,080	17,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు: లైవ్: రూ.140 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.240



కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ముప్పుతిప్పలు పెడుతోందని రైతులు గగ్గోలుపెడుతున్నారు. సీసీఐ రోజుకో ఆంక్ష విధిస్తుండటంతో పత్తి కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో విధిలేక పత్తిని దళారులకు విక్రయిస్తున్నామని వాపోతున్నారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించి 15రోజులు కాగా, ఇప్పటి వరకు కేవలం 1,476 మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

15 రోజుల్లో.. 1476 మెట్రిక్ టన్నులే!

- మందకొడిగా పత్తి కొనుగోలు ప్రక్రియ
- కొనుగోళ్లకు ముప్పుతిప్పలు పెడుతున్న సీసీఐ
- రోజుకో ఆంక్షతో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు

రైతులను ఆదుకునేందుకు సీసీఐ పెద్ద మొత్తంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాల్సి ఉండగా, అటు జిన్నింగ్ మిల్లులకు, ఇటు రైతులకు ఎలాంటి ప్రయోజనం లేనివిధంగా వ్యవహరిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక దశలో జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మెకు వెళ్లాలని ప్రయత్నించగా, రాష్ట్ర ప్రభుత్వం జోక్యంతో విరమించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీఐ వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావివ్వడమేగాక దళారులకు ప్రయోజనం చేకూర్చేలా ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2025-26లో మద్దతు ధరకు సీసీఐకి పత్తి విక్రయించేందుకు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని నిబంధన విధించింది. ఈ యాప్ డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్‌పై రైతులకు అవగాహన లేకపోవడంతో పాటు కొందరు రైతులకు అసలు స్మార్ట్‌ఫోన్ కూడా లేదు. మొబైల్ నెంబర్‌తో ఓటీపీ ద్వారా లాగిన్ కావాలని, సీసీ ద్వారా మద్దతు ధర పొందాలంటే రైతులు కచ్చితంగా 'కపాస్ కిసాన్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించడం తలనొప్పిగా మారింది. ఈ నిబంధనను ఎందుకు విధించారనే దానిపై స్పష్టత లేదు. దీనికి తోడు ఐరిష్ స్కాన్ లేదంటే ఓటీపీ ద్వారా ఆధార్ ధ్రువీకరణ ఉండాలనడం, ఆధార్ మొబైల్ లింకు ఉన్నదే తీసుకురావాలని చెప్పడం సమస్యగా మారింది. సీసీఐ వద్ద మద్దతు ధరకు పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్ విధానంకూడా సమస్యగా పరిణమించింది.

1,476 మెట్రిక్ టన్నులు కొనుగోలు

జిల్లాలో సీసీఐ కొనుగోళ్లు నామమాత్రంగా సాగుతున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 57 లక్షలకు పైగా క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తుందని అంచనా. అయితే అకాల వర్షాలు, తుఫాన్, తెగుళ్ల కారణంగా పత్తి దిగుబడి 50 శాతానికి పడిపోయింది. వచ్చిన పత్తి కూడా రంగు మారడం, తడిసిపోవడంతో రైతులను కుంగదీస్తోంది. ఇప్పటి వరకు అంటే 15రోజుల్లో సీసీఐ కేవలం 1,476 మెట్రిక్‌టన్నులు (14,760 క్వింటాళ్లు) మాత్రమే కొనుగోలు చేసింది. 8శాతం తేమ ఉన్న పత్తికి మాత్రమే క్వింటాకు రూ.8,110 చెల్లిస్తుండగా, ఆపైనా తేమశాతం పెరిగితే రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకొస్తున్నా పలు తిరకాసులు పెడుతోంది. స్లాట్ బుకింగ్‌కే సమయం సరిపోతోందని రైతులు వాపోతున్నారు. సీసీఐ మద్దతు ధర ఇచ్చేలా లేదని రైతులు భావిస్తూ దళారుల వైపు వెళ్లుతున్నారు. దీంతో దళారులు పత్తి నాణ్యత లేదని పేర్కొంటూ క్వింటాకు రూ.5వేల లోపే ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే దళారులు చాలా చోట్ల రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి వారికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ జీరాక్స్‌లు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకొని రైతుల పేరుతో దళారులు సీసీఐలో పత్తి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. రైతుల నుంచి పత్తి..

- మిగతా 8వ పేజీలో...



చలి పెరుగుతోంది

తగ్గుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

నల్లగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఈ నెల మొదటి వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతోంది. అడపాదడపా వర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చల్లటి గాలులు వీస్తున్నాయి. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ గాలులు ఉంటున్నాయి. చలి గాలులతో పిల్లలు, వృద్ధులు అధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి నెల రెండో వారం వరకు చలి ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంటోంది. ఇప్పటికే వాతావరణశాఖ చలి గాలులకు సంబంధించి ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. అంతేగాక ఈ నెల మూడో వారం నుంచి డిసెంబరు, జనవరి నెలల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంటోంది. ఆదివారం కనిష్ఠ ఉష్ణోగ్రత 20డిగ్రీలుగా నమోదైంది. చలి పెరుగుతుండటంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా స్వెట్టర్లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే చలినుంచి రక్షణకోసం చలి మంటలు వేస్తున్నారు.

చలి గాలుల నుంచి రక్షణ ఇలా

- చల్లని గాలులు ఎక్కువగా ఉన్నప్పుడు బయటకు వెళ్లడం తగ్గించాలి.
- వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.
- చలికాలంలో డీ-విటమిన్ కోసం ఉదయం ఎండలో కాసేపు ఉండటంతో పాటు పోషకాహారం తీసుకోవాలి.
- పొరలుగా ఉన్న దుస్తులు ధరిస్తే వెచ్చదనం పెరుగుతుంది.

- మిగతా 7వ పేజీలో...

లక్ష్యాన్ని అధిగమించి

- నాగార్జునసాగర్‌లో జలవిద్యుత్ ఉత్పత్తి
- ఈ ఏడాది లక్ష్యం 1,450మిలియన్‌యూనిట్లకు 2,132.23ఎం.యూ ఉత్పత్తి
- 3,000 ఎం.యూ ఉత్పత్తి దిశగా ప్లాంట్

7

కుట్టు శిక్షణ పేరుతో మహిళలకు కుచ్చుటోపీ

- శిక్షణ, రుణం ఇప్పిస్తానని డబ్బు వసూలు
- ఆ తరువాత ముఖం చాటేసిన ట్రస్ట్ నిర్వాహకుడు

7

శునకాలతో బెంబేలు!

- వీధికుక్కలకు చర్మవ్యాధులు
- గుంపులుగా సంచారం, భయాందోళనలో ప్రజలు

6

మాస్టర్ ప్లాన్ అమలెప్పుడు?

- కాగితాలకే పరిమితమైన ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి

న్యాయ సహాయం, చట్టాలపై అవగాహన

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు

నల్లగొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు తెలిపారు. ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ నిర్వహించడంతోపాటు కుటుంబ వివాదాలను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ నెల 15న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు న్యాయ సహాయం అందిస్తూ సంస్థకు, ప్రజలకు వారధిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కట్టా అనంతరెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ ఎన్.భీమార్జున్‌రెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యుడు కట్టా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ ఎం.లెనిన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

బీసీ జేఏసీ చైర్మన్ ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కోసం రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసి చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో 40 కుల సంఘాలకు చెందిన నాయకులు పాల్గొని బీసీ రిజర్వేషన్లపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌కు మాట్లాడుతూ, రిజర్వేషన్ల కోసం బీసీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 1 నుంచి నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుపై చర్చించి ఆమోదింపజేయాలన్నారు. బీసీ బిల్లుపై ప్రధాని మౌనం విడాలన్నారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమం తరహాలో రాష్ట్రంలో మరో బీసీ ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీతో చర్చించాలన్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఆయన ఇంటి ముందు సీఎం రేవంత్‌రెడ్డి ధర్నా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు గుంటోజు వెంకటాచారి, చిలుకరాజు చెన్నయ్య, వైద్యుల సత్యనారాయణ, పాల్వాయి రవి, ఎరుకల శంకర్‌గౌడ్, కర్నాటి యాదగిరి, చెన్నూరి భరద్వాజ యాదవ్, నవీన్‌కుమార్, దుడ్డు కృష్ణమూర్తి, అంబటి శివకుమార్, ఖదీర్, పందుల సైదులుగౌడ్, గండిచెరువు వెంకన్న, అయితగోని జనార్దన్, పుట్ట వెంకన్న, మార్గం సతీష్‌కుమార్, ఖమ్మంపాటి శంకర్‌దుర్గ, గడగోజు విజయ్‌చారి, చెన్నోజు రాజు, మచ్చ గిరి, నాగరాజ్‌గౌడ్, యాదగిరి, పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

కట్టంగూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కట్టంగూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్లుగా మార్చి కార్మిక వర్గాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్మికుల సమస్యలను చర్చించేందుకు ఈ నెల 29, 30 తేదీల్లో నల్లగొండలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెంజర్ల సైదులు, మాచర్ల యాదమ్మ, కంకణాల శోభరాణి, నాగయ్య, చెవుగోని ధనలక్ష్మి, రేణుక, గద్దపాటి ఎల్లయ్య, శ్రీకాంత్, రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో.. పీఏసీఎస్‌ల భాగస్వామ్యం!



- సాగు విస్తీర్ణం పెంపునకు రైతులతో సదస్సులు
- ప్రతీ పీఏసీఎస్ పరిధిలో 100 ఎకరాల విస్తీర్ణం పెంపు లక్ష్యం
- ఈనెల 11 నుంచి 15 వరకు రైతు వేదికల్లో సమావేశాలు

నార్కట్‌పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణంలో ఇక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలూ భాగస్వామ్యం కానున్నాయి. ఆయిల్ పామ్ సాగుతో కలిగే లాభాలు, ఉపయోగాలపై ఉద్యాన, వ్యవసాయశాఖలు వేర్వేరుగా ఇప్పటికే అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాయి. అయినా జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు రైతుల నుంచి ఆశించిన మేరకు స్పందన లభించడంలేదు. ఫలితంగా నిర్దేశిత సాగు విస్తీర్ణం లక్ష్యాన్ని చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతుల ద్వారా కొనసాగుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆయిల్‌పామ్ సాగులో భాగస్వామ్యం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు అక్టోబరు 28వ తేదీన సహకారశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రతీ పీఏసీఎస్ పరిధిలో సదస్సులు నిర్వహించనున్నారు.

11 నుంచి 15 వరకు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపు కోసం సహకారశాఖ కమిషనర్ సూచన, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీఏసీఎస్‌లను భాగస్వామ్యం చేస్తూ ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు రైతు సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని 33 మండలాల పరిధిలోని 43 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్లు, సీఈవోలతో పాటు సహకార శాఖ విభాగం నుంచి ఇప్పటికే ఎంపిక చేసిన మానిటరింగ్ అధికారి హాజరుకానున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల నుంచి ఏవో లేదా ఏఈవోలతో నిర్ణీత తేదీల్లో రైతు సదస్సులను ఆయా రైతువేదికల్లో నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ నుంచి ప్రతినిధులు సైతం హాజరు కానున్నారు. పీఏసీఎస్‌ల భాగస్వామ్యంలో ఆయిల్‌పామ్ సాగువైపు రైతులను ప్రోత్సహించడం, సాగు విస్తీర్ణాన్ని పెంచడమే కార్యాచరణ లక్ష్యంగా నాలుగు రోజుల పాటు ఈ సదస్సులు కొనసాగనున్నాయి.

ప్రతీ పీఏసీఎస్‌కు 100 ఎకరాల లక్ష్యం

సాగు పెంపు కోసం ప్రతీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 100 ఎకరాలను లక్ష్యాన్ని నిర్దేశించారు. సంప్రదాయ వరి ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ వైపుకు ఆసక్తి చూపేలా రైతులను ప్రోత్సాహించాలని సహకారశాఖ కమిషనర్ ఆదేశించారు. అందుకు ఉద్యాన, వ్యవసాయ, సహకారశాఖ సిబ్బంది సహాయం తీసుకోవాలని సూచించారు.

టాంటాం వేయిస్తాం



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు భాగస్వామ్యం కావాలని సహకార శాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. కలెక్టర్ సూచనల మేరకు ఈనెల 11 నుంచి 15 వరకు రైతు అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. రైతువేదికల్లో నిర్వహించే ఈ సదస్సు సమాచారాన్ని ఒక రోజు ముందే టాంటాం ద్వారా తెలియజేస్తాం. నార్కట్‌పల్లి పీఏసీఎస్ పరిధిలో 11వ తేదీన, అమ్మనబోలులో 12న, అక్కెనపల్లిలో 13న రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. రైతులు ఈ సదస్సుకు హాజరు కావాలి.

- కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నార్కట్‌పల్లి

నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు జారీ చేయాలి



మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పరమేశ్

మిర్యాలగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడలో మాట్లాడుతూ, గ్రూప్-3, 4 ఉద్యోగులు, ఉపాధ్యాయులు క్రిమిలేయర్ పరిధిలోకి రారని, వారికి నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చాలు మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే సర్టిఫికెట్ జారీ చేయకుండా తహసీల్దార్లు అనర్హులుగా ప్రకటిస్తున్నారని అన్నారు. నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ జారీ విషయంలో ప్రభుత్వం సర్క్యులర్ 424/2014ను తేదీ 31.10.2017న, జీవో ఎంఎస్ నెం.20లో స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. డైరెక్ట్ గ్రూప్-1, 2, సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల వేతనం రూ.8లక్షల పరిమితికి మించినప్పుడు నాన్ క్రిమినల్ సర్టిఫికెట్‌కు అనర్హులు అని అన్నారు. గతంలో బీసీ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను సంప్రదించగా బీసీ సంక్షేమశాఖ ద్వారా అన్ని కార్యాలయాలకు మార్గదర్శకాలు పంపారని అన్నారు. అయినా అధికారులు సర్టిఫికెట్ల జారీ విషయంలో ఇబ్బందులకు గురిచేయడం శోచనీయమన్నారు. ఉద్యోగులకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ జారీచేయని తహసీల్దార్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రానికి రాకుండానే మిల్లుకు

- ధాన్యం తరలింపుపై పలు అనుమానాలు
- అధికారుల తర్జనభర్జన



ఆలగడప ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్ర భవనం

మిర్యాలగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి రాకుండా ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లుకు తరలించడంపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు మిర్యాలగూడ మండలం పరిధిలో ఆలగడప, మిర్యాలగూడ, తడకమళ్లకు చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబరు 8న అవంతిపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేశారు. కాగా 15 రోజులుగా రైతులు మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకువస్తుండగా, తేమశాతం తగ్గకపోవడంతో రోజూ ఆరబెడుతూ రాశుల వద్ద కాపలా కాస్తున్నారు. వాతావరణంలో మార్పులతో ధాన్యం ఆరకపోవడంతో ఆదివారం వరకు కాంటాలు ప్రారంభం కాలేదు.

ఆలగడప పీఏసీఎస్ అధికారులు ఈ నెల 4న పట్టణంలోని ఓ రైస్‌మిల్లుకు అన్నారం గ్రామానికి చెందిన ఇరువురు రైతుల పేరుతో ధాన్యం విక్రయించినట్లు వెలుగు చూసింది. ఈ విషయంపై పీఏసీఎస్ అధికారులు లారీ లోడు కొనుగోలు చేశామని, కాంటాలు ప్రారంభం కాలేదని పొంతనలేని సమాధానం చెబుతుండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి మిల్లుకు తరలించారా? లేక కాగితాలపై కొనుగోలు చేసినట్లు సృష్టించారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. అసలు కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లే ప్రారంభం కానప్పుడు నేరుగా ఇద్దరు రైతుల కల్లాల వద్ద కాంటాలు వేసి మిల్లుకు తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆలగడప పీఏసీఎస్ ఇన్‌చార్జి కార్యదర్శి సైదులును ప్రశ్నించగా మండలపరిధిలోని అన్నారం రైతులు ధాన్యాన్ని కల్లాల వద్దే ఆరబెట్టారని, అక్కడే కాంటాలు వేసి ట్రక్‌షీట్ రాసి నేరుగా మిల్లుకు పంపినట్లు తెలిపారు. రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసింది నిజమేనని, అయితే ధాన్యాన్ని ఐకేపీకి తీసుకువచ్చి కాంటా వేయకుండా నేరుగా మిల్లుకు పంపడం తప్పేనని ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు.

'పార్టీ దిమ్మెను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

మాడ్గులపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాపురం గ్రామంలో పార్టీ దిమ్మెను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు జానిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మాపురం గ్రామంలో కూల్చివేసిన బీజేపీ దిమ్మెను ఆదివారం ఆయన పరిశీలించారు. పార్టీ దిమ్మెను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు జానకిరాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుధాకర్‌రెడ్డి మృతికి సంతాపం

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బోయ సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, లచ్చిరెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, పాండునాయక్, అక్బర్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

కమ్యూనిస్టు ప్రభుత్వంతోనే
ప్రజా సమస్యల పరిష్కారం

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



స్తూపాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కమ్యూనిస్టు ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లిలో సీపీఎం మండల నాయకుడు బొంగరాల వెంకన్న వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపాన్ని రంగారెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. వెంకన్న గ్రామంలో సీపీఎం బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తున్నాయని అన్నారు. సమస్యల పరిష్కారానికి సీపీఎం చేసే పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, చౌగాని సీతారాములు, నాగ్ హుస్సేన్, కన్నెగంటి రామకృష్ణ, వెంకన్న, నగేష్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలంతా ఏకం కావాలని జేఏసీ కోకన్వీనర్ దాసరాజు జయరాజు పిలుపునిచ్చారు. అమరవీరుల పార్కులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అధికశాతం ఉన్న బీసీలందరూ పార్టీలు, కులాలకతీతంగా ఏకమవ్వాలన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కలిసికట్టుగా కదలాల్సిన అవసరం ఉందని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ బీసీ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చేగొండి మురళీయాదవ్, బోయనపల్లి రవీందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



దయాకర్ కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

మాడ్గులపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణానికి చెందిన వై ద్యం దయాకర్ మాడ్గులపల్లి మండలంలోని ధర్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, టీపీఆర్టీయూ సభ్యుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆదివారం దయాకర్ కుటుంబసభ్యులను పరామర్శించి సంఘం తరుపున రూ.1లక్ష చెక్కును అందించి మనోధైర్యం కల్పించారు. భవిష్యత్తులో ద యాకర్ కుటుంబానికి ఏ ఆపద వచ్చినా అన్ని విధాలుగా ఆదుకుంటామన్నా రు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, సత్తయ్య, గాదె వెంకట్‌రెడ్డి, మహమ్మద్ ఫరీద్, నిరంజన్‌రెడ్డి, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

సా..గుతున్న ఎత్తిపోతలు

» డివిజన్‌లో ముందుకుసాగని ప్రాజెక్టు పనులు
» నిధుల కొరత, అటవీశాఖ నుంచి రాని అనుమతులు
» పూర్తి చేయాలని రైతుల డిమాండ్



నిలిచిపోయిన ఏకేబీఆర్ ఎత్తిపోతల పనులు, పైప్‌లైన్ పనులు

దేవరకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని గుట్టలపై ఉన్న గ్రామాలకు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించాలని 2021లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎత్తిపోతల పథకాల పనులకు శంకుస్థాపన చేశారు. కొన్ని పనులు ప్రారంభమై నిధుల కొరత, అటవీశాఖ అనుమతులు రాకపోవడం, వరుసగా వర్షాలు కురుస్తుండటంతో పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో ఎత్తిపోతల పనులు ముందుకు సాగడం లేదు. దేవరకొండ నియోజకవర్గంలోని నేరేడుగొమ్ము, చందంపేట, పీఏపల్లి మండలాలలోని గుట్టలపై ఉన్న గ్రామాలకు సాగునీరు అందించాలని గత ప్రభుత్వం నాగార్జునసాగర్ ఉపఎన్నిక సమయంలో హామీ ఇచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేసి రూ.585 కోట్లతో అనుమతులు మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. చందంపేట మండలం పొగిళ్ల, కంభాలపల్లి, పీఏపల్లి మండలం ఏకేబీఆర్, నేరేడుగొమ్ము మండలం అంబభవాని, పీఏపల్లి మండలం పెద్దగట్టు లిఫ్టు పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిచ్చారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పలు పర్యాయాలు అటవీశాఖ అనుమతులు పూర్తి చేసి నిధులు కేటాయించి ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తూనే ఉన్నారు. అయినా నిధుల కొరత, వరుసగా వర్షాలు రావడం, అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. పీఏపల్లి మండలం ఏకేబీఆర్ 80 శాతం, నేరేడుగొమ్ము మండలం అంబభవాని ఎత్తిపోతల పనులు 30శాతం వరకే పనులు జరిగాయి. ఇటీవల తుఫాన్‌తో కూడిన వర్షాలు కురవడంతో అంబభవాని ఎత్తిపోతల పథకం పంపుహౌజ్‌లోకి భారీగా వరదనీరు చేరింది. దీంతో పంపుహౌజ్ పనులు నిలిచిపోయాయి. ఏకేబీఆర్ ఎత్తిపోతల పనులు కూడా ప్రస్తుతం నిలిచిపోయాయి. పొగిళ్ల, కంభాలపల్లి, పెద్దగట్టు ఎత్తిపోతల పనులకు అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలే దు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకం పరిధిలోని పీఏపల్లి, గుడిపల్లి, గుర్రంపోడు మండలాలలోని 6700 ఎకరాలు, కంభాలపల్లి ఎత్తిపోతల పూర్తయితే 9వేల ఎకరాలు, పొగిళ్ల 9వేల 20 ఎకరాలు, అంబభవానీ పూర్తయితే 12వేల ఎకరాలు, పెద్దగట్టు పూర్తయితే 5వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అటవీశాఖ అనుమతులతో పనులు పూర్తిచేసి సాగునీరు అందించాలని రైతులతో పాటు రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలి




గుట్టలపై ఉన్న గ్రామాలకు ఎత్తిపోతల ద్వారా నీరు అందించేపథకం మంచిదే. నిధులు కేటాయించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి. ప్రాజెక్టు పూర్తయితే గుట్టలపై ఉన్న గ్రామాల రైతులకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది.

- కంభాలపల్లి ఆనంద్, రైతు సంఘం నేత అజ్మాపురం, పీఏపల్లి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

ఎత్తిపోతలకు నిధుల కేటాయింపు విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉంది. అంబభవానీ, ఏకేబీఆర్‌పనులు జరుగుతున్నాయి. త్వరలో అన్ని ఎత్తిపోతల పనులు వేగంగా జరగనున్నాయి.

- రాములు, ఈఈ, ఎత్తిపోతల పథకం



కలిసికట్టుగా కార్తీక వనభోజనాలు

● లోక కల్యాణార్థం భక్తుల పాదయాత్ర

మిర్యాలగూడ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన భోజన కార్యక్రమం ఆధ్యాత్మిక చింతనతో సాగింది. ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ కాలనీ నుంచి బొర్రయిపాలెం గ్రామంలోని శ్రీవేంకటేశ్వర ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో చేపట్టిన పాదయాత్రలో వంద మంది భక్తులు పాల్గొనగా, వనభోజన కార్యక్రమంలో 700మంది పాల్గొన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న భక్తులకు మాజీ ఎంపీపీ, మైనార్టీ నేత షేక్ జిందా జప్తివీరప్పగూడెం వద్ద గ్రామస్తులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కుప్పాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కూరపాటి సాంబశివరావు, కోశాధికారి వెంపటి లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు తొండపు హరగోపాల్, కమిటీ సభ్యులు నీరుకంటి నారాయణ, దాచేపల్లి మురళి, మారేపల్లి శివప్రసాద్, కుప్పాల శ్రీనివాసరావు, శ్రీనివాస్ డి.యాదయ్య, శ్యామ్‌కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పాదయాత్ర చేపట్టిన హనుమాన్‌పేట కాలనీవాసులు

15 రోజుల్లో.. 1,476 మెట్రిక్ టన్నులే!

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేయని సీసీఐ, దళారుల నుంచి మాత్రం కొర్రీలు లేకుండా కొనుగోలు చేస్తుండటం గమనార్హం. కొంతమంది దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ధర ఎక్కువగా వచ్చినప్పుడు విక్రయించేందుకు నిల్వ చేస్తున్నారు. రైతులకు ప్రయోజనంలేని ప్రభుత్వరంగ సంస్థలు దళారులకు ఉపయోగపడేలా వ్యవహరిస్తున్నాయని సీసీఐపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో ప్రారంభంకాని కొనుగోళ్లు

ఎల్-1, ఎల్-2, ఎల్-3 అనే నిబంధనలతో కొన్ని జిన్నింగ్ మిల్లులతో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించిన సీసీఐ ఇంకా పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో చాలా మండలాలల్లో రైతులకు జిన్నింగ్ మిల్లులు అందుబాటులో లేక దూర ప్రాంతాల మిల్లులకు విక్రయించాలనే ఆలోచన చేయకుండా దళారులకు విక్రయిస్తున్నారు. ఆయా మండలాల రైతులకు సీసీఐ కొనుగోలు చేసే జిన్నింగ్ మిల్లులు అందుబాటులో ఉంటే సమస్య ఉండేది కాదు. అందుకు విరుద్ధంగా కేవలం 15మిల్లుల్లో మాత్రమే సీసీఐ కొనుగోళ్లు చేపడుతోంది. ఇంకా తొమ్మిది జిన్నింగ్ మిల్లుల్లో అసలు కొనుగోళ్లే ప్రారంభం కాలేదు. ప్రారంభమైన జిన్నింగ్ మిల్లుల్లో 50శాతం కొనుగోళ్లు దాటితేనే సీసీఐ మరో జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్లు ప్రారంభిస్తుందని తెలిసింది. ఇప్పటికే కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని సీసీఐ కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ తీరుపై జిన్నింగ్ మిల్లుల యజమానులు సైతం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

కావాలనే జిన్నింగ్ మిల్లుల యజమానులను ఇబ్బందులకు గురిచేయడం కోసమే సీసీఐ ఆంక్షలు విధిస్తోందని వాపోతున్నారు. కొనుగోళ్లు సాఫీగా చేయాల్సిన సీసీఐ కేవలం మొక్కుబడిగా వ్యవహరిస్తూ సమస్యలకు గురిచేస్తోందని రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా వ్యవహరిస్తోందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఉన్న దిగుబడులైనా సకాలంలో కొనుగోలు చేస్తే రైతులకు కనీసం పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వానాకాలం సీజన్‌లో కురిసిన వర్షాలు పత్తిని దెబ్బతీయగా, వచ్చిన కాస్త దిగుబడినైనా విక్రయిద్దామంటే సీసీఐ సహకరించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

చింతపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని గొడకొండ్ల గ్రామంలో అయ్యప్ప స్వామి పడిపూజలను వైభవంగా నిర్వహిం చారు. గ్రామానికి చెందిన తమ్మడగోని శేఖర్, రాజు (కన్నెస్వామి) అయ్యప్ప ఆలయంలో ఆదివారం పడిపూజ చేశారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, లక్ష్మీ దేవి సహిత సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. దేవరకొండకు చెందిన ప్రముఖ గాయకుడు కిషన్ లాల్ బీరెల్లి మహేందర్ భజన బృందం పాడిన భక్తిపాటలు అలరించాయి. భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, తమ్మడగోని కృష్ణ కిష్టమ్మ దంపతులు, మట్ట యాదయ్యగౌడ్ జంగయ్య, మల్లోజు కిరణ్, బాదేపల్లి శ్రీకాంత్, తలారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి మండలం వీ.టి.నగర్(గొడకొండ్ల) దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

అయ్యప్ప స్వామివారికి అభిషేకం

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సీతా రామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అ య్యప్ప మూలవిరాట్‌కు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊరే నరేష్- నాగలక్ష్మీ దంపతులు, గురుస్వామి ప్రభాకర్‌రెడ్డి, జయప్రకాశ్‌శర్మ, ఊరే జనార్దన్, ధనమ్మ, అయ్యప్ప మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధులు
చట్టాల గురించి తెలుసుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత

దేవరకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వృద్ధులు చట్టాల గురించి తెలుసుకోవాలని న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. న్యాయసేవా జాతీయ దినోత్సవం సందర్భంగా దేవరకొండలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వృద్ధాశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత వృద్ధుల హక్కులు, విధి, విధానాలు, సీనియర్ సిటిజన్ యాక్టు 2007 గురించి వివరించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమ మహేశ్వర్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, శౌకత్‌అలీ, కర్నాటి సురేష్, వనం జగదీశ్వర్, రియాజ్, చినగాని అశోక్, సాయి, మంజునాథ్, పోలీసులు, న్యాయవాదులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

దేవరకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన, ధర్నా నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ఆర్డినెన్స్ జీవో నెంబర్ 9ని బీసీ బిల్లు చట్టసభలో అంగీకారం తెలిపినా గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాజ్యాంగ సవరణ ద్వారా బిల్లులను ఆమోదింపజేసి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కొద్దిసేపు మౌనదీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు డాక్టర్ చొల్లేటి భాస్కరచారి, వరికుప్పల శ్రీను, వీరయ్య, రంజాన్‌బేగ్, భాష చౌహన్, శ్రీనివాసచారి, అన్వర్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకల వివరాలు

మిర్యాలగూడ మీదుగా.. గుంటూరు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వైపునకు..

నెం	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1.	07609	పూర్ణ- తిరుపతి స్పెషల్	00-13	00-15	గురువారం
2	17232	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	01-29	01-30	ఆది/మంగళ
3	17222	లోకమాన్యతిలక్-విశాఖ ఎక్స్‌ప్రెస్	04-14	04-15	సోమ/శుక్ర
4	12806	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	08-57	08-58	డైలీ
5	12756	భావ్‌నగర్ సూపర్‌ఫాస్ట్	09:30	09:31	ఆదివారం
6	07791	కాచిగూడ-నడికుడి	11:55	11:57	ఆదివారం మినహా
7	07046	సికింద్రాబాద్-డిబ్రూఘర్ స్పెషల్	13:05	13:06	సోమవారం
8	07638	శ్రీనగర్ - తిరుపతి	13:06	13:07	మంగళవారం
9	07699	నాగర్‌సోల్-బెజవాడ	13:10	13:11	ఆదివారం
10	17230	శబరి ఎక్స్‌ప్రెస్	14:22	14:23	డైలీ
11	17645	రేపల్లె ఎక్స్‌ప్రెస్	14:46	14:47	డైలీ
12	12704	ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్	17:54	17:55	డైలీ
13	12748	పల్నాడు ఎక్స్‌ప్రెస్	18:00	18:01	డైలీ
14	17016	విశాఖ ఎక్స్‌ప్రెస్	18:44	18:45	డైలీ
15	12604	చెన్నై సూపర్‌ఫాస్ట్	19:14	19:15	డైలీ
16	12734	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	20:04	20:05	డైలీ
17	07446	లింగంపల్లి- కాకినాడస్పెషల్	20:54	20:55	మంగళ, గురు, శని
18	08580	సికింద్రాబాద్ - విశాఖ స్పెషల్	21:30	21:32	గురువారం
19	07509	హైదరాబాద్ - తిరుపతి స్పెషల్	22:02	22:03	గురువారం
20	07435	నాగర్‌కోల్ వీక్లీ స్పెషల్	22:20	22:22	శుక్రవారం
21	07189	హెచ్‌సాహిబ్- ఈరోడ్ స్పెషల్	23:07	23:09	శుక్రవారం
22	08586	మహబూబ్‌నగర్-విశాఖపట్నం	23:10	23:12	బుధవారం
23	07165	హైదరాబాద్ - కటక్ స్పెషల్	23:10	23:12	గురువారం
24	67775	డెమో	23:40	---	డైలీ
25	07191	కాచిగూడ మధురై స్పెషల్	23:15	23:17	సోమవారం
26	07695	సికింద్రాబాద్-రామంతపురం స్పెషల్	23:20	23:21	బుధవారం
27	67777	డెమో	---	23:45	డైలీ

మిర్యాలగూడ మీదుగా.. నల్లగొండ, హైద్రాబాద్, సికింద్రాబాద్ వైపునకు..

నెం.	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1	07610	తిరుపతి- పూర్ణ స్పెషల్	01-20	01-21	బుధవారం
2	12603	చెన్నై సూపర్‌ఫాస్ట్	01:39	01:40	డైలీ
3	07192	మధురై- కాచిగూడ ఎక్స్‌ప్రెస్	01:45	01:47	గురువారం
4	07436	నాగర్‌సోల్ - కాచిగూడ వీక్లీ స్పెషల్	02:00	02:02	శుక్రవారం
5	12733	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	02:43	02:45	డైలీ
6	08585	విశాఖ-మహబూబ్‌నగర్	02:45	02:47	బుధవారం
7	07632	నాగర్‌సోల్-హైదరాబాద్	02:45	02:47	సోమవారం
8	17015	విశాఖ ఎక్స్‌ప్రెస్	03:29	03:30	డైలీ
9	07445	కాకినాడ పోర్ట్-లింగంపల్లి ఎక్స్	03:39	03:40	మంగళ/గురు/శని
10	07510	తిరుపతి- హైదరాబాద్‌స్పెషల్	03:55	03:56	శనివారం
11	67778	డెమో	05:30	---	డైలీ
12	67776	డెమో	----	05:35	డైలీ
13	08579	విశాఖ-సికింద్రాబాద్	05:44	05:45	గురువారం
14	12703	ఫలక్‌నామా సూపర్‌ఫాస్ట్	06:51	06:52	డైలీ
15	07696	రామంతపురం-సికింద్రాబాద్	07:04	07:05	శనివారం
16	12747	పల్నాడు సూపర్‌ఫాస్ట్	07:40	07:41	డైలీ
17	17229	శబరి ఎక్స్‌ప్రెస్	08:32	08:33	డైలీ
18	17646	రేపల్లె ఎక్స్‌ప్రెస్	11:05	11:06	డైలీ
19	07047	డిబ్రూఘర్-సికింద్రాబాద్‌స్పెషల్	11:20	11:22	శనివారం
20	12755	భావ్‌నగర్ ఎక్స్‌ప్రెస్	11:32	11:33	గురువారం
21	12805	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	15:10	15:11	డైలీ
22	17221	లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్	15:29	15:30	బుధ/శని
23	07166	కటక్- హైద్రాబాద్	15:30	15:32	గురువారం
24	07792	డెమో	16:50	16:52	ఆదివారం మినహా
25	17231	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	16:59	17:00	శుక్ర/ఆది
26	07190	ఈరోడ్- నిడదవోలు	18:48	18:49	ఆదివారం
27	07698	బెజవాడ-నాగర్‌సోల్	19:24	19:25	శుక్రవారం





-(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడటౌన్)